


**దేవాదులను పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది**

అనుక్షణం ప్రజల పక్షం

RNI NO: TELTEL/2023/87607

# జర్నలిస్ట్ వార్త

తెలుగు దిన పత్రిక..

WANTED
రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
దిన పత్రికలో పని చేయుటకు
తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలోని
అన్ని జిల్లా,మండల,కేంద్రాలకు రిపోర్టర్లు కావలెను
జర్నలిస్ట్ వార్త
JV NEWS
ఎడిటర్: బిర్రు కరుణాకర్
Cell:9701249103

సంపుటి - 2   సంచిక -21   బుధవారం 19 మార్చి 2025   ఎడిటర్ : బిర్రు కరుణాకర్   పేజీలు -8   వెల - 5/-   01

Published From Warangal : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## రెండు వారాల్లో కౌంటర్ చేయాలి

**కృష్ణా నది ప్రాజెక్టులపై తెలంగాణ రిట్ పిటిషన్**

**కేంద్రం, ఏపీ ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు**



**న్యూఢిల్లీ మార్చి18(జర్నలిస్ట్ వార్త):** కృష్ణా నదీ ప్రాజెక్టుల అంశంపై తెలంగాణ రాష్ట్రం దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఈరోజు విచారించింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. మిగతాది 2లో...

## తొక్కిసలాట మృతులకు కనీసం నివాళి ఏదీ

**ప్రధాని మోడీపై విపక్షనేత రాహుల్ విసుర్లు**

**సభలో ప్రతిపక్ష నేతకు మాట్లాడే**

**అవకాశమివ్వాలన్న రాహుల్ గాంధీ**



న్యూఢిల్లీ, మార్చి18(జర్నలిస్ట్ వార్త): మహాకుంభమేళ విజయవంతం కావడంపై ప్రధాని మోదీ పార్లమెంటులో స్పందించినా... తొక్కిసలాట ఘటనలో మరణించిన వారికి ఆయన నివాళులర్పించ లేదని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. మంగళవారం లోక్ సభలో వెలుపల ఎంపీ రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. మిగతాది 2లో...

## ఫోర్త్ సిటీ పేరుతో రియల్ వ్యాపారం

**కమీషన్ల మీదనే కాంగ్రెస్ దృష్టి - హైడ్రా పేరుతో వసూళ్ల దందా**

**పేదల ప్రతాపాలు.. పెద్దలతో ఒప్పందాలు : మాజీమంత్రి కేటీఆర్**




**హైదరాబాద్,మార్చి18(జర్నలిస్ట్ వార్త):** అక్రమ వసూళ్ల కోసమే కాంగ్రెస్ పార్టీ హైడ్రాను తీసుకొచ్చిందని మాజీమంత్రి కేటీఆర్ ఆరోపించారు. ప్రభుత్వం సంక్షేమ పథకాలను గాలికి వదిలేసి.. కమీషన్లు ఎక్కడ వస్తాయో అక్కడ దృష్టి పెట్టిందని కేటీఆర్ ధ్వజమెత్తారు. హైడ్రా పేరుతో వసూళ్ల దందా.. మూసీ పేరుతో పేదల ఇండ్లపై పగబట్టిందని విరుచుకుపడ్డారు కేటీఆర్. ఫార్మాసిటీ పేరుతో భూముల చెర.. ఫోర్త్ సిటీ పేరుతో సీఎం కుటుంబ రియల్ వ్యాపారం చేస్తుందని ఆరోపించారు. ట్రిపుల్ ఆర్ పేరుతో పేదల భూముల ఆక్రమించుకుంటుందన్నారు. పేదలపై ప్రతాపం చూపిస్తూ.. పెద్దలతో ఒప్పందాలు కుదుర్చుకుంటుందన్నారు.

మిగతాది 2లో...

# ఎస్సీ వర్గీకరణకు ఆమోదం..



**దళితులకు కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ అండగాఉంటుంది**

**వర్గీకరణ బిల్లు ద్వారా మా చిత్తశుద్ధినిచాటుకున్నాం**

**దశాబ్దాల సమస్యకు శాశ్వతపరిష్కారం చూపాం**

**జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పెరగాలి అసెంబ్లీలో సిఎం రేవంత్‌రెడ్డి**

**చిత్తశుద్ధితో చేశాం : మంత్రులు దామోదర, ఉత్తమ్**

**హైదరాబాద్,మార్చి18(జర్నలిస్ట్ వార్త):** ఎస్సీ వర్గీకరణ బిల్లుకు తెలంగాణ శాసనసభ ఆమోదం తెలిపింది. స్వాతంత్య్రం వచ్చినప్పటి నుంచి దళితులకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటోందని ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. పార్టీలో, ప్రభుత్వంలో ఎస్సీలకు కాంగ్రెస్ పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. బాబూ జగ్జీవన్‌రామ్‌కు కేంద్రంలో వివిధ శాఖల బాధ్యతలు అప్పగించి గౌరవించింది.

మిగతాది 2లో...

## కుంభమేళా ఓ అద్భుత కార్యక్రమం

**లోక్‌సభలో ప్రధాని మోడీ**

**అభినందనలు**




**న్యూఢిల్లీ,మార్చి18(జర్నలిస్ట్ వార్త):** కుంభమేళా ద్వారా భారత వైభవాన్ని యావత్ ప్రపంచం వీక్షించిందని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీఅన్నారు. ఎంతో పరమపవిత్రంగా ఈ క్రతువు జరిగిన తీరు ప్రపంచాన్ని కూడా అబ్బురపరచిందని అన్నారు. మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ లోక్‌సభలో కుంభమేళా గురించి ప్రస్తావించారు. ప్రయాగరాజ్‌లో కుంభమేళా విజయవంతంగా నిర్వహించడం సమిష్టి కృషికి అసలైన ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. కుంభమేళా విజయవంతం చేసేందుకు ఎందరో తమ వంతు పాత్ర పోషించారు. ఆ కర్మ యోగులందరికీ నా ధన్యవాదాలని అన్నారు. భిన్నత్వంలో ఏకత్వానికి ఆలవాలమైన భారత సంస్కృతి కుంభమేళాలో ఆవిష్కృతమైందని ప్రధాని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా చెలరేగుతున్న యుద్ధాల కారణంగా దేశాల మధ్య ఎడం పెరుగుతున్న నేపథ్యంలో భారత దేశం.. భిన్నత్వంలో ఏకత్వమే తన ప్రత్యేకత అనిమిగతాది 2లో...

## ఏపీ అసెంబ్లీలో ఫొటో షూట్



అసెంబ్లీలోఎమ్మెల్యేలందరూ గ్రూప్ ఫొటో దిగారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కూడా ఈ ఫొటోల్లో ఉన్నారు. ఈ ఫొటో షూట్ పై డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు స్పందించారు. అసెంబ్లీ ఆవరణలో ఎమ్మెల్యేలు అందరూ గ్రూప్ ఫొటో తీసుకోవడం జరిగిందని వెల్లడించారు. ఇది ప్రజాస్వామ్య ప్రయాణానికి గుర్తుగా, రాబోయే తరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని అభివర్ణించారు.__ మార్చి18(జర్నలిస్ట్ వార్త):

# నేడు అసెంబ్లీలో బడ్జెట్

**ప్రవేశ పెట్టనున్న భట్టి**

**అంతకు ముందే కేబినేట్‌లో ఆమోదం**



**హైదరాబాద్,మార్చి18(జర్నలిస్ట్ వార్త):** తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్‌ను బుధవారం శాసనసభలో ప్రవేశపెట్టనుంది. రాష్ట్ర ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క శాసనసభలో బుధవారం ఉదయం 11.14 గంటలకు ప్రవేశపెట్టనున్నారు. బడ్జెట్‌ను ముందుగా కేబినేట్ ఆమోదించాల్సి ఉంటుంది. దీంతో ఉదయం 9.30 గంటలకు సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన కేబినెట్ సమావేశం కానుంది. అసెంబ్లీ కమిటీ హాలులో మంత్రివర్గ సమావేశమై బడ్జెట్‌కు ఆమోదం తెలుపనుంది. అనంతరం బడ్జెట్ కాపీలతో భట్టి విక్రమార్క అసెంబ్లీకి చేరుకోనున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి ఇది రెండో బడ్జెట్ కావడం విశేషం. బడ్జెట్‌లో ఎలాంటి నిర్ణయాలు ఉండబోతున్నాయని రాష్ట్ర ప్రజలు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల అమలుపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో ఏ పథకానికి ఏ మేరకు కేటాయింపులు ఇవ్వబోతున్నదనేది ఆసక్తిగా మారింది. అలాగే ప్రభుత్వ ఉద్యోగులు, రాష్ట్రంలోని ప్రాజెక్టుల విషయంలో కీలక ప్రకటనలు ఉండే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## యాదగిరిగుట్ట ఆలయానికి ధర్మకర్తల మండలి ఏర్పాటు

**: మంత్రి కొండా సురేఖ**

**18 మంది సభ్యులతో వైటీడీ ట్రస్టు బోర్డు ఏర్పాటు**



2లో.

# ఎస్సీ వర్గీకరణ బిల్లుకు శాసనసభ ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)
దేశంలోనే తొలిసారిగా ఎస్సీ వ్యక్తి దామోదరం సంజీవయ్యను సీఎంగా చేసింది కాంగ్రెస్ పార్టీ. ఉమ్మడి రాష్ట్రంలోనూ ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరిగింది. దశాబ్దాలుగా సాగిన పోరాటంలో ఎంతో మంది ప్రాణాలు అర్పించారు. 2004లో ఉషా మెహ్రా కమిటీ– వేసి సమస్య పరిష్కరించడానికి కాంగ్రెస్ ప్రయత్నించింది. ఇన్నాళ్లకు నేను సీఎంగా ఉండగానే సమస్య పరిష్కారం కావటం సంతోషకరం. సుప్రీంకోర్టు తీర్పు వచ్చిన గంటలోపే ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా నిర్ణయం ప్రకటించాం. వెంటనే ఉత్తమ్ నేతృత్వంలో మంత్రివర్గ ఉపసంఘం నియమించాం. మంత్రివర్గ ఉపసంఘం సూచన మేరకు షమీమ్ అక్తర్ కమిషన్ నియమించాం. కమిషన్.. ప్రజల నుంచి 8,681 ప్రతిపాదనలు స్వీకరించింది. కమిషన్ నివేదికను ఏ మాత్రం మార్చకుండా ఆమోదించాం. 59 ఎస్సీ ఉప కులాలను 3 గ్రూపులుగా కమిషన్ విభజించింది. 59 కులాలు ఇప్పటివరకు పొందిన ప్రయోజనాల ఆధారంగా కమిషన్ సిఫార్సులు చేసిందని సీఎం వివరించారు. ఎస్సీ వర్గీకరణ బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు. దశాబ్దాలుగా జరుగుతున్న ఎస్సీ వర్గీకరణ పోరాటానికి గొప్ప విజయం లభించింది. ఇక, ఎస్సీ వర్గీకరణ బిల్లుపై చర్చ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. ’ స్వాతంత్య్రం వచ్చినప్పటినుంచి కాంగ్రెస్ పార్టీ దళితులకు అండగా ఉంటోంది. దశాబ్ధాలుగా ఎస్సీ వర్గీకరణ కోసం పోరాటం జరుగుతోంది. ఎంతో మంది ప్రాణాలు అర్పించారు. బిల్లును ఎకగ్రీవంగా ఆమోదించిన సభ్యులకు నా కృతజ్ఞతలు. నేను ముఖ్యమంత్రిగా ఉండగానే సమస్య పరిష్కారం కావటం సంతోషం’ అని అన్నారు. బిల్లు ఆమోదం పొందిన నేపథ్యంలో.. ఎస్సీ సామాజిక వర్గ ఎమ్మెల్యేలు సంతోషం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాష్ట్ర ప్రభుత్వం జస్టిస్ షమీమ్ అక్తర్ ఏక సభ్య కమిషన్ సిఫార్సు చేసిన ప్రకారమే 3 గ్రూపులతో ఎస్సీ వర్గీకరణ బిల్లును రూపొందించింది. ఎస్సీల్లో అత్యంత వెనుకబడిన 15 కులాలను గ్రూప్ 1లో చేర్చారు. మొత్తం జనాభాలో వీరి జనాభా 3.288గా ఉంది. వీరికి 1 శాతం రిజర్వేషన్ కల్పించనున్నారు. మధ్యస్థంగా లబ్ధిపొందిన 18 కులాలను గ్రూప్ 2లో చేర్చారు. వీరి జనాభా 62.748గా ఉంది. వీరికి 9శాతం రిజర్వేషన్ కల్పించారు. కాస్త మెరుగైన ప్రయోజనాలు పొందిన 26 కులాలను గ్రూప్ 3లో వేశారు. వీరి జనాభా 33.963గా ఉంది. వీరికి 5 శాతం రిజర్వేషన్ కల్పించారు. ఏ,బీ,సీ,డీ, కేటగిరీలుగా ఎస్సీ వర్గీకరణను చేసే అవకాశం లేదని కమిషన్ స్పష్టం చేసింది. ప్రభుత్వం.. కమిషన్ సిపార్సుతో పాటు–ఎపిరికల్ డేటాను దృష్టిలో పెట్టు–కుని న్యాయపర చిక్కులు రాకుండా ఉండేలా బిల్లును సిద్ధం చేసింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో ఎస్సీ జనాభా 1,38,78,078. వీరిలో మాదిగలు 67,02,609 ఉండగా.. మాలలు 55,70,244 మంది ఉన్నారు. ఈ లెక్కల ప్రకారం మాలల జనాభా కంటే మాదిగల జనాభా 11.3 లక్షలు ఎక్కువ. ఎస్సీల్లో కేవలం ఈ రెండు కులాల జనాభానే 80 శాతం వరకు ఉంటు–ందని ఓ అంచనా. అందరికీ కలిపి 15 శాతం రిజర్వేషన్లు ఉన్నాయి. ఈ మొత్తం కోటాలో మాలలే ఎక్కువ లాభం పొందుతున్నారనే గొడవ దశాబ్దాల క్రితమే మొదలైంది. 1972 నుంచి మాదిగ వర్గానికి చెందిన నేతలు ముఖ్యమంత్రుల్ని కలుస్తూ వినతి పత్రాలు ఇస్తూ వచ్చారు. మంద క్రిష్ణ మాదిగ కూడా దీనిపై ఎప్పటినుంచో మాట్లాడుతున్నారు..’ 1996 నాటికి మాదిగలు 18 వేల ఉద్యోగాల్లో ఉండగా, వాటిలో 80–90 శాతం నాల్గో తరగతి ఉద్యోగాలే. మరోవైపు, మాలలు అన్ని రకాలవీ కలిపి 72 వేల ఉద్యోగాల్లో ఉన్నారని అన్నారు.

# కుంభమేళా ఓ అద్భుత కార్యక్రమం

(మొదటి పేజీ తరువాయి)
కుంభమేళాతో గొప్పగా చాటుకుందని పేర్కొన్నారు. మహా కుంభమేళాలో యువతరం పెద్ద ఎత్తున పాల్గొనడంపై కూడా ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. సంప్రదాయాలను ఆధ్యాత్మికతను యువత సగర్వంగా అందిపుచ్చుకున్నదని వ్యాఖ్యానించారు. కుంభమేళాలో భారత వైభవాన్ని యావత్ ప్రపంచం చూసింది. ఈ మహాసంరంభంలో యావత్ దేశం ఉత్సాహంగా పాల్గొంది. భవిష్యత్తు తరాలకు ఈ సంరంభం స్ఫూర్తిగా నిలుస్తుంది. భారత్ శక్తి సామర్థ్యాలను ప్రశ్నించే వారికి కుంభమేళా విజయం తగిన జవాబు ఇచ్చింది. 144 ఏళ్లకోసారి వచ్చే మహాకుంభమేళా 45 రోజుల పాటు యావత్ ప్రపంచం ఆశ్చర్య పోయే రీతిలో జరిగిన విషయం తెలిసిందే. ఫిబ్రవరి 26తో ముగిసిన ఈ మహా సంరంభంలో ఏకంగా 66 కోట్ల మంది పాల్గొన్నారు. ప్రయాగ్‌రాజ్‌లోని త్రివేణీ సంగమంలో పవిత్రస్నానం ఆచరించి ఆధ్యాత్మిక ఆనందాన్ని అనుభవించారు. ఇక ఫిబ్రవరి 5న ప్రధాని మోదీ కూడా స్వయంగా గంగా, యమున, సరస్వతీ నదుల సమాగమమైన త్రివేణీ సంగమంలో పుణ్య స్నానం చేశారు. గంగా నదికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కుంభమేళాలో అక్కడక్కడా కొన్ని అపశృతులు చోటు–చేసుకున్నాయి. జనవరి 29న మౌని అమావాస్య సందర్భంగా తొక్కిసలాట జరిగింది. ఈ ప్రమాదంలో 30 మంది మరణించినట్టు యూపీ ప్రభుత్వం పేర్కొంది.

# ఫోర్త్ సిటీ పేరుతో రియల్ వ్యాపారం

(మొదటి పేజీ తరువాయి)
నాడు మద్యం వద్దని చెప్పిన రేవంత్ రెడ్డి.. నేడు మద్యం ముద్దు అంటున్నారని పేర్కొన్నారు. ధరల సవరణ పేరుతో, కొత్త బ్రాండ్ల పేరుతో అక్రమ ఒప్పందాలు చేసుకుంటున్నారని కేటీఆర్ పేర్కొన్నారు. ఆరు గ్యారంటీలు గాలికి వదిలేసి.. వాటిపై ప్రశ్నించిన వారిని జైలుకు పంపిస్తున్నారని తెలిపారు. రైతుభరోసా రాదు.. రుణమాఫీ కాదు.. పంటలు కొనుగోలు చేయరు.. రూ.500 క్వింటాలు ధాన్యానికి బోనస్ బోగస్ అయింది.. తులం బంగారం ఇయ్యరు.. ఉద్యోగాలు వేయరు.. ఉద్యోగులకు పీఆర్సీ రాదు, డీఏలు ఇవ్వరు అని కేటీఆర్ మండిపడ్డారు. సత్యం వధ.. ధర్మం చెర బట్టిందన్నారు. పదేళ్ల కేసీఆర్ పాలనలో దేశానికే దిక్సూచిగా ఎదిగిన తెలంగాణను.. 15 నెలల కాంగ్రెస్ పాలనలో అధం పాతాళానికి తీసుకెళ్లారు. ఆర్థికశక్తిగా ఎదిగిన తెలంగాణను ఆగం చేసి బీద అరుపులు అరుస్తున్నారు. ఇది పాలన కాదు పీడన.. ఇది సర్కారు కాదు సర్కస్ కంపెనీ అని రేవంత్ రెడ్డి సర్కార్‌పై కేటీఆర్ తీవ్ర విమర్శలు గుప్పించారు.

కాంగ్రెస్ పాలనలో రైతన్నలను కష్టాలు వెంటాడుతూనే ఉన్నాయని మాజీమంత్రి కేటీఆర్ అన్నారు. సాగుకు సరిపడా విద్యుత్, నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. రైతు రుణమాఫీ కాక, రైతు భరోసా నిధులు విడుదల కాకపోవడంతో అన్నదాతలు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారు. రేవంత్ రెడ్డి సర్కార్ వ్యవసాయ రంగాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోంది. సాగునీరు లేక పంటలు ఎండిపోతున్నప్పటికీ కాంగ్రెస్ ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తోంది. ఈ పరిస్థితులపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. ముంచుకొస్తున్న ముప్పును ముందే హెచ్చరించినా.. ఈ తెలివిలేని కాంగ్రెస్ సర్కారు తలకెక్కలేదు అని కేటీఆర్ విమర్శించారు. కల్పతరువు లాంటి కాళేశ్వరం ప్రాజెక్టుపై కక్షగట్టొద్దని మొత్తుకున్నా విషం తప్ప విషయం లేని ముఖ్యమంత్రి వినిపించుకోలేదు. కళ్ల ముందే పచ్చని పంటలు ఎండుతున్నాయని వ్యవసాయ శాఖ సమర్పించిన ప్రాథమిక నివేదిక రాష్ట్ర ప్రభుత్వానికి చెంపపెట్టు లాంటిదని కేటీఆర్ పేర్కొన్నారు. ఓవైపు రుణమాఫీ కాక, పెట్టుబడి సాయం రాక అన్నదాత అల్లాడుతున్న సమయంలో గోరి చుట్టు మీద రోకలి పోటులా పంటలు ఎండటంతో రైతు బతుకు ఆగమైంది. ఇది కాలం తెచ్చిన కరువు కాదు, కాంగ్రెస్ కక్షగట్టి తెచ్చిన కరువు కాబట్టి రైతులను ఆదుకునే పూర్తి బాధ్యత ముఖ్యమంత్రిదే. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు కూడా జరుగుతున్న నేపథ్యంలో.. ఎండిన ప్రతి ఎకరానికి వెంటనే రూ.25 వేల నష్ట పరిహారం ప్రకటించి వెంటనే చెల్లించాలి. రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత నుంచి తప్పించుకోవాలని చూస్తే రైతులతో కలిసి కాంగ్రెస్ సర్కారు భరతం పడతాం అని కేటీఆర్ హెచ్చరించారు. జై కిసాన్.. జై తెలంగాణ.. అని కేటీఆర్ నినదించారు.

# 21 నుంచి పది పరీక్షలు

**హైదరాబాద్,మార్చి18(జర్నలిస్ట్ వార్త):**
రాష్ట్రంలో పదవ తరగతి వార్షిక పరీక్షలు ఈ నెల 21 నుంచి ప్రారంభం కానున్నాయి. ఏప్రిల్ 4 వరకు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు టెన్త్ పరీక్షలు జరుగుతాయి. పరీక్ష ప్రారంభ సమయానికి మరో 5 నిమిషాలు అదనంగా అంటే ఉదయం 9.35 గంటల వరకు విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అనుమతించాలని ప్రభుత్వ పరీక్షల విభాగం నిర్ణయించింది. ఈ పరీక్షలకు రాష్ట్రవ్యాప్తంగా 5,09,403 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానుండగా, వారిలో 2,58,895 బాలురు, 2,50,508 బాలికలు ఉన్నారు. పదవ తరగతి పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 2,650 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఈ పరీక్షల కోసం 2650 మంది ఛీఫ్ సూపరిడెంటెండెంట్లు, 2650 డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్లు, 28,100 మంది ఇన్విజిలేటర్లను నియమించినట్లు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ.కృష్ణారావు తెలిపారు. విద్యార్థుల కోసం 040 23230942 ఫోన్ నెంబర్‌తో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.
ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ట్రాఫిక్ ఇబ్బందుల నేపథ్యంలో విద్యార్థులు ఉదయం 8.30 గంటల వరకు పరీక్షా కేంద్రాలకు చేరుకునేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరీక్షల ప్రారంభానికి ఒకటి రెండు రోజుల ముందు పరీక్షా కేంద్రాలను సందర్శించాలని తెలిపారు. అన్ని పరీక్షా కేంద్రాలలో ఛీఫ్ సూపరింటెండెంట్ గదిలో సిసి కెమెరాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షలు జరిగే రోజుల్లో పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. పది పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు 144 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించారు. పదో తరగతి పరీక్షా కేంద్రాల్లోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి ఉండదని స్పష్టం చేశారు. అధికారులు, ఇన్విజిలేటర్లు, సిబ్బంది ఎవరికి పరీక్షా కేంద్రాల్లోకి సెల్‌ఫోన్ అనుమతి ఉండదని అన్నారు. విద్యార్థులు ఎలక్ట్రానిక్ సబంధించిన ఎటువంటి పరికరాలు పరీక్షా కేంద్రాల్లోనికి తీసుకురాకూడదని తెలిపారు. హాల్‌టికెట్, ఎగ్జామ్ ప్యాడ్, పెన్ పెన్సిల్, షార్ప్‌నర్, ఎరాయిజర్, జామెట్రిక్ పరికరాలతో విద్యార్థులు పరీక్షలకు హాజరుకావచ్చని చెప్పారు. ఈ పరీక్షలో ప్రశ్నాపత్రంలోని ప్రతి పేజీపై క్యూఆర్ కోడ్‌ను ముద్రించినట్లు వెల్లడించారు.
వెబ్‌సైట్‌లో హాల్ టికెట్లు
పదవ తరగతి వార్షిక పరీక్షల హాల్ టికెట్లను **www.bse.telangana.gov.in** వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ.కృష్ణారావు తెలిపారు. హాల్ టికెట్లను డిఇఒల ద్వారా పాఠశాలలకు పంపించామని, ప్రధానోపాధ్యాయుల ద్వారా విద్యార్థులు హాల్ టికెట్లు పొందాలని తెలిపారు. వివిధ కారణాలతో పాఠశాలల యాజమాన్యాలు హాల్ టికెట్లు ఇవ్వడానికి నిరాకరిస్తే విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని పరీక్షలకు హాజరుకావచ్చని పేర్కొన్నారు.

# యాదగిరిగుట్ట ఆలయానికి ధర్మకర్తల మండలి ఏర్పాటు

## : మంత్రి కొండా సురేఖ



**హైదరాబాద్,మార్చి18(జర్నలిస్ట్ వార్త):** యాదగిరిగుట్ట ఆలయానికి ధర్మకర్తల మండలిని ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. దేవాదాయ చట్ట సవరణ బిల్లుపై శాసనసభలో చర్చ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పద్దెనిమిది మంది సభ్యులతో యాదగిరిగుట్ట ట్రస్టు బోర్డు (వైటీడీ) ఉంటుందని వెల్లడించారు. ఈ బోర్డు పదవీ కాలాన్ని రెండు సంవత్సరాలుగా నిర్ణయించామని, బోర్డు చైర్మన్, సభ్యులకు ఎలాంటి జీతభత్యాలు ఉండవని స్పష్టం చేశారు.వైటీడీకి బడ్జెట్ ఆమోదం ప్రభుత్వం ద్వారా జరుగుతుందని మంత్రి తెలిపారు. ఐఏఎస్ అధికారి ఈవోగా ఉంటారని వెల్లడించారు. వైటీడీ బోర్డు విద్యా సంస్థలను స్థాపించవచ్చు, నిర్వహించవచ్చని తెలిపారు. యాదగిరిగుట్టలో ఆధ్యాత్మిక, వేద పాఠశాలలను స్థాపించుకోవచ్చని తెలిపారు.గతంలో యాదగిరిగుట్ట భక్తులకు సరైన వసతులు లేవని ఆమె అన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి ప్రభుత్వం వసతులను ఏర్పాటు చేసిందని తెలిపారు. యాదగిరిగుట్టను మరింత మెరుగుపరిచేందుకే పాలక మండలిని ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఏటా రూ. 100 కోట్ల ఆదాయం వచ్చే ఆలయాలు దేవాదాయ శాఖ పరిధిలోకి వస్తాయని ఆమె స్పష్టం చేశారు.

# రెండు వారాల్లో కౌంటర్ చేయాలి

(మొదటి పేజీ తరువాయి)
పిటిషన్‌ను సుప్రీంకోర్టు ఈరోజు విచారించింది. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని కేంద్ర ప్రభుత్వం, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. జస్టిస్ అభయ్ ఓకా, జస్టిస్ ఉజ్జల్ భుయాన్‌లతో కూడిన ధర్మాసనం ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది. కౌంటర్లు దాఖలైన వారం రోజుల్లో రిజాయిండర్ ఫైల్ చేయాలని కూడా ఆదేశించింది.కృష్ణా నది ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించాలని కేంద్ర ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నోటిఫికేషన్‌ను తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాల్ చేసింది.తెలంగాణ అక్రమంగా విద్యుత్ ఉత్పత్తి చేస్తూ నీటిని వాడుకుంటోందని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ మేరకు తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు దాఖలు చేసిన పిటిషన్లపై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది.

# తొక్కిసలాట మృతులకు కనీసం నివాళి ఏదీ

(మొదటి పేజీ తరువాయి)
ప్రయాగ్ రాజ్ వేదికగా నిర్వహించిన మహాకుంభమేళ విజయవంతం కావడంపై ఉత్తరప్రదేశ్ ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారని చెప్పారు. కానీ ఈ ప్రయాగ్ రాజ్‌లో జరిగిన తొక్కిసలాటలో పలువురు మరణించారని... వారికి ప్రధాని మోదీ నివాళులర్పించలేదని చెప్పారు. కుంభమేళా అంటే.. చరిత్ర, సంస్కృతి, సంప్రదాయమని రాహుల్ గాంధీ అభివర్ణించారు. ఆ క్రమంలో ప్రధాని మోదీ వ్యాఖ్యల తో తాము పూర్తిగా ఏకభవిస్తామన్నారు. కానీ తొక్కిసలాట ఘటనలో మరణించిన వారికి ఘనంగా నివాళులు అర్పించక పోవడం పట్ల ఆయన తన తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశారు. అలాగే ఈ కుంభమేళ కారణంగా తమకు ఉపాధి లభిస్తోందని యువత ఆశించిదని చెప్పారు. కానీ వారి ఆశలపై నీళ్లు చల్లారన్నారు. అయితే మనది ప్రజాస్వామ్య దేశమని.. ఈ నేపథ్యంలో ప్రతిపక్ష నాయకుడికి సభలో మాట్లాడే అవకాశం ఉంటుందన్నారు. కానీ తనకు సభలో మాట్లాడే అవకాశం మాత్రం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. జనవరి 13 నుంచి ఫిబ్రవరి 26వ తేదీ వరకు దాదాపు 45 రోజుల పాటు– ప్రయాగ్ రాజ్‌లో మహాకుంభమేళ నిర్వహించారు. ఈ మహాకుంభమేళలో పవిత్ర స్నానమాచరించేందుకు దేశవిదేశాల నుంచి కోట్లాది మంది ప్రయాగ్ రాజ్ చేరుకున్నారు. అలా దాదాపు 60 కోట్ల మందికి పైగా భక్తులు గంగానదిలో పవిత్ర స్నానమాచరించారు.ఈ నేపథ్యంలో పార్లమెంట్ బడ్జెట్ రెండో విడత సమావేశాలు ఇటీవల ప్రారంభమైనాయి. దీంతో మంగళవారం లోక్‌సభలో ప్రధాని నరేంద్ర మోదీ మాట్లాడుతూ.. మహాకుంభమేళ విజయవంతమైందన్నా

# అమెరికా ఫస్ట్ అంటే.. అమెరికా మాత్రమే కాదు

## యూఎస్ ఇంటిలిజెన్స్ చీఫ్ తులసి గబ్బర్డ్




**న్యూఢిల్లీ,మార్చి18(జర్నలిస్ట్ వార్త):** అమెరికా అధ్యక్షులు ట్రంప్ 'అమెరికా ఫస్ట్' పాలసీ అర్థం అమెరికా మాత్రమే అని తప్పుగా అర్థం చేసుకోకూడదని అమెరికా డైరెక్టర్ ఆఫ్ నేషనల్ ఇంటెలిజెన్స్ తులసి గబ్బర్డ్ మంగళవారం వ్యాఖ్యానించారు. రైసినా డైలాగ్ సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. భారత్–అమెరికా సంబంధాన్ని విస్తరించడంలో చాలా అవకాశం ఉందని అన్నారు. గత నెల వాషింగ్టన్ డిసిలో జరిగిన సమావేశంలో ప్రధాని మోడీ, ట్రంప్‌లు ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేసే అంశాలపై దృష్టిసారించారని అన్నారు. ఈ సమావేశాన్ని ఇద్దరు పాతస్నేహితుల పున:కలయికగా అభివర్ణించారు. ట్రంప్ అమెరికా ఫస్ట్ పాలసీ మాదిరిగానే, ప్రధాని మోడీ ఇండియా ఫస్ట్ అనే పాలసీకి కట్టు–బడి ఉన్నారని అన్నారు. అమెరికా ఫస్ట్ అంటే అమెరికా మాత్రమే అని తప్పుగా అర్థం చేసుకోకూడదని తులసి గబ్బర్డ్ అన్నారు. రెండు దేశాల మధ్య భాగస్వామ్యం, స్నేహం పెరుగుతూనే ఉంటాయని తాను విశ్వసిస్తున్నానని అన్నారు. శాంతి భద్రతల స్థిరత్వాన్ని ట్రంప్ కట్టుబడి ఉన్నారని అన్నారు.

-------------

# ఉపాధిహామీని నీరుగార్చే యత్నం

## రాజ్యసభలో లో సోనియా ఆవేదన



**న్యూఢిల్లీ,,మార్చి18(జర్నలిస్ట్ వార్త)::**ఉపాధి హామీ పథకాన్ని కేంద్ర ప్రభుత్వం బలహీనపరచడం బాధాకరం అని కాంగ్రెస్ అగ్ర నాయకురాలు, ఎంపీ సోనియా గాంధీ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై రాజ్యసభలో సోనియా మాట్లాడారు. ప్రస్తుత బీజేపీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని క్రమపద్ధతిలో బలహీనపరచడం చాలా ఆందోళనకరం అని తెలిపారు. బడ్జెట్ కేటాయింపుల్లో రూ. 86,000 కోట్లు స్తబ్దుగా ఉన్నాయని పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ పథకం బహుళ సవాళ్లను ఎదుర్కొంటోందని చెప్పారు. వేతన చెల్లింపుల్లో నిరంతరం జాప్యాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అలాగే ప్రస్తుతం చెల్లిస్తున్న నగదు కూడా సరిపోదని.. దాన్ని రూ.400 కనీస వేతనంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా కార్మికులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సకాలంలో వేతనం ఇవ్వకపోతే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడతారని సభ దృష్టికి సోనియా తీసుకొచ్చారు. ఇక పథకాన్ని మరింత విస్తరించడానికి తగినంతగా బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని కేంద్రాన్ని సోనియా కోరారు.

# మే 20న దేశవ్యాప్త కార్మిక సమ్మె

**హైదరాబాద్,మార్చి18(జర్నలిస్ట్ వార్త):**
మే 20న దేశ వ్యాప్త సమ్మెకు అనేక కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయి. లేబర్ కోడ్ రద్దు చేయడం, ప్రైవేటీకరణను నిలిపివేయడం, ఇండియన్ లేబర్ కాన్ఫరెన్స్ ద్వారా క్రమం తప్పకుండా సంప్రదింపులు జరపాలనే డిమాండ్లతో ఈ సమ్మె నిర్వహించనున్నాయి. నెలవారీ కనీస వేతనం రూ .26,000, ఉద్యోగుల పెన్షన్ పథకం కింద నెలవారీ పెన్షన్ రూ. 9000 అందించడం కూడా ఈ సంఘాల డిమాండ్లలో ఉన్నాయి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల నుంచి వచ్చే విరాళాలతో ప్రత్యేక నిధిని ఏర్పాటు చేసి, దాని ద్వారా ఏ పథకం కిందకు రాని వారికినెలకు రూ. 6000 ఇవ్వాలని కూడా యూనియన్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. కేంద్ర కార్మిక సంఘాలు , స్వతంత్ర రంగాల సమాఖ్యలు, వివిధ సంఘాల ఆధ్వర్యంలో కార్మిక జాతీయ సమావేశం నిర్వహించాయి. రెండు నెలల పాటు ప్రచారం జరపాలని కార్మిక సంఘాలన్నీ కలిపి ఈ నిర్ణయం తీసుకున్నాయి. ఈ సమ్మె భవిష్యత్తులో కార్మికులు, రైతుల దేశవ్యాప్త నిర్ణయాత్మక పోరాటాలకు నాంది పలుకుతుందని ఓ ప్రకటనలో పేర్కొన్నాయి. దేశంలో నిరుద్యోగం, పేదరికం, అసమానతలకు వ్యతిరేకంగా ఈ పోరాటం కొనసాగిస్తున్నట్టు కార్మిక సంఘాలు తెలిపాయి.

# 6వేల కోట్లతో రాజీవ్ యువ వికాసం

**నిరుద్యోగ యువతకు ఇదొక సదవకాశం- టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు**



**ఐనవోలు/మార్చి18(జర్నలిస్ట్ వార్త):** ఐనవోలు కాంగ్రెస్ మండల పార్టీ, యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు, మాజీ ఎంపీపీ మార్నెని మధుమతి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉందని అన్నారు. అందువల్లే నిరుద్యోగ యువతకు స్వయం ఉపాధి కింద రాజీవ్ యువ వికాసం పథకం తెచ్చి వారికి ఆర్థిక సహాయం అందజేస్తుందని తెలిపారు. 6 వేల కోట్లతో చేపట్టనున్న ఈ పథకం ద్వారా 5 లక్షల మంది ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనారిటీల నిరుద్యోగులకు ఇదొక సదవకాశం అన్నారు. ఒక్కో లబ్ధిదారునికి 4 లక్షల వరకు ఋణం మంజూరు చేయనున్నట్లు తెలిపారు. 60 నుండి 80 శాతం వరకు రాయితీతో ఈ ఋణాలను మంజూరు చేయనున్నారు. అందువల్ల నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గతంలో ఏ ప్రభుత్వాలు చేయని విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తుందన్నారు. నిరుద్యోగ యువత ఉపాధి కోసం ఇంత పెద్ద ఎత్తున నిధులు కేటాయించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, జిల్లా మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, సీతక్క, సురేఖ, వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బుచ్చిరెడ్డి, రాయపురం సాంబయ్య, మండల యూత్ అధ్యక్షులు సుదీర్, రాకేష్ రెడ్డి, సునీల్, భాస్కర్, రాజు, రవి, సమ్మయ్య, సతీష్, కుమారస్వామి, రహీంపాషా, సాంబయ్య, శ్రీనివాస్, మహేందర్, మొగిలి, ప్రశాంత్, జనార్ధన్, ఉత్తం కుమార్, జగన్, అరవింద్, ప్రణయ్ తదితరులు పాల్గొన్నారు.

# సమాజంలో జర్నలిస్ట్ పాత్ర కీలకం

**- ముందు తరానికి వారి సేవలు అత్యవసరం**

**- సీనియర్ జర్నలిస్ట్ కొమురయ్య మృతి**

**- నివాళులు అర్పించిన డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్**



**నర్సంపేట/మార్చి18(జర్నలిస్ట్ వార్త):** నర్సంపేట నియోజకవర్గం ఖానాపురం మండలానికి చెందిన ఈనాడు దినపత్రిక సీనియర్ జర్నలిస్ట్ చలిగంటి కొమురయ్య మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా అధ్యక్షులు, నర్సంపేట నియోజకవర్గ ఇంచార్జ్ డ్యాగల శ్రీనివాస్ ముదిరాజ్ సంఘటన స్థలానికి చేరుకుని కొమురయ్య భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో జర్నలిస్ట్ పాత్ర కీలకమైందన్నారు. ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా జర్నలిస్ట్ సోదరులు కృషి చేస్తారని అన్నారు. ప్రజలకు కావలసిన అత్యవసరాలు నిత్యవసరాలపై దృష్టి సారించి ఉత్తేజవంతమైన వార్తా కథనాలు ప్రచురితం చేస్తారు. అటు ప్రభుత్వానికి ఇటు ప్రజలకు మధ్య వారదులుగా వ్యవహరిస్తూ సామాజిక బాధ్యత నిర్వహిస్తారు. సమాజంలో ముందు తరం వారికి భవిష్యత్తు ప్రణాళికల పట్ల అవగాహన ఉండాలని తెలియజేస్తూ, సమాజంలో జరుగుతున్న వ్యవహారాలను ప్రచురితం చేస్తూ ఉత్తేజ పరిచేవారే జర్నలిస్ట్ లని కొనియాడారు. అలాంటి సామాజిక బాధ్యతతో పనిచేసిన జర్నలిస్ట్ మృతి బాధాకరమని సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం జిల్లా కార్యదర్శి గాదెగోని బిక్షపతి గౌడ్, నర్సంపేట పట్టణ ఉపాధ్యక్షులు మద్దెల శ్యామ్ కుమార్ యాదవ్, ఓడపెల్లి రమేష్, కార్యదర్శి గాండ్ల శ్రీనివాస్, మద్దెల కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

## పదవతరగతి విద్యారులకు ఎగ్జామినేషన్ మెటీరియల్ వితరణ



తల్లాడ/మార్చి18(జర్నలిస్ట్ వార్త):తల్లాడ లయన్స్ క్లబ్ అధ్యక్షులు బెల్లంకొండ ఆంజనేయులు ఆధ్వర్యంలో మంగళవారం లూర్దు మాత స్కూల్ నారాయణపురంలో పదవ తరగతి విద్యార్థులకు ఎగ్జామినేషన్ ప్యాడ్లు, పెన్నులు, రబ్బర్లు ఎలైజర్లు, పెన్సిల్లు, పంపిణి చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ రీజియన్ చైర్ పర్సన్ ఉండ్రూవరలక్ష్మి పదవ తరగతి విద్యార్థులకు పరీక్షలు రాసే టైంలో కావలసిన సామాగ్రిని (ఎగ్జామినేషన్ మెటీరియల్) స్పాన్సర్ చేశారన్నారు. వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డి సి వేమిరెడ్డి వెంకట్ నారాయణరెడ్డి స్కూల్ హెచ్ఎం విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు మొదలగువారు పాల్గొన్నారు.

# టీబీ వ్యాధిపై అవగాహన కలిగివుండాలి







**-నోడల్ అధికారి పెద్దపుల్లయ,**


**తల్లాడ/మార్చి18(జర్నలిస్ట్ వార్త):**విద్యార్థులు టీబీ వ్యాధిపై అవగాహన కలిగివుండాలని టీబీ నోడల్ అధికారి పెద్దపుల్లయ అన్నారు. మంగళవారం తల్లాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని కర్నవల్లి గ్రామంలోనీ జిల్లా పరిషత్ పాఠశాలలో జాతీయ క్షయ నిర్మూలన దినోత్సవం కార్యక్రమంలో భాగంగా స్కూల్ విద్యార్థులకు టీబీ వ్యాధి పై అవగాహన నిర్వహించారు. వ్యాధి లక్షణాలు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు నిర్మూలనను విద్యార్థుల యొక్క బాధ్యత గుర్తు చేశారు. విద్యార్థులకు జీవన శైలిలో మార్పుల వల్ల వచ్చే వ్యాధుల గురించి వివరించారు. విద్యార్థులు బాల్య దశ నుంచి వ్యాయామము మంచి పోషక విలువలు ఉన్న ఆహారం తీసుకోవాలని తెలిపారు. మత్తు పదార్థాలకు బానిసలుగా మరోడాన్నారు. నిల్వ ఉన్న ఆహార పదార్థాలు కూల్డ్రింకులు మొదలైన వాటికి దూరంగా ఉండాలని విద్యార్థులకు తెలిపారు. విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురి కాకుండా ప్రశాంతంగా ఉండాలని, సెల్ ఫోన్ కి దూరంగా ఉండాలన్నారు. శరీరం మీద ఎటువంటి స్పర్శ లేని రాగి వర్ణపు మచ్చలు ఉంటే వెంటనే వైద్య సిబ్బందికి తెలియాపారుచాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్షయ నిర్మూలన సామాజిక బాధ్యత అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి మొదటి ద్వితీయ బహుమతులను సర్టిఫికెట్స్ అందించారు. ఈ కార్యక్రమంలో టీబీ చికిత్స సూపర్వైజర్ వై సురేష్, స్కూల్ హెడ్ మాస్టర్ ఝాన్సీ పాఠశాల ఉపాధ్యాయులు ఏఎన్ఎం ఆదిలక్ష్మి ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

# తాటికల్లా తమాషానా...

## -ఎండాకాలంలో తాగితే ఏమవుతుంది..?







**కల్లూరు/మార్చి18(జర్నలిస్ట్ వార్త):** తాటి చెట్టు నుండి ఉదయాన్నే కల్లు తీస్తారు దీనిని తెలంగాణలో చిన్న,పెద్ద,ఆడ, మగ తేడా లేకుండా తాగుతూ ఉంటారు. దీనిని ఆల్కహాల్ కింద పరిగణించలేము తాటి చెట్టు కొన నుండి వచ్చే నీటిని సున్నం పూసిన కుండలు నిల్వ చేస్తారు ఈ విధంగా నిల్వచేసిన నీటి అడుగున సున్నం స్థిరపడుతుంది పై భాగంలో ఉన్న స్వచ్ఛమైన నీటిని తాగుతూ ఉంటారు. సహజంగా లభించే ఈ నీటిలో విటమిన్ సి,విటమిన్ బి,క్యాల్షియం, మెగ్నీషియం, పొటాషియం,ఇనుము, ఫైబర్,జింక్,బాష్పరం వంటి శరీరానికి అవసరమైన పోషకాలు ఉంటాయి.

తాటికల్లులోని విటమిన్ సి శరీరంలో రోగ నిరోధక శక్తిని బలపరుస్తుంది ఇది వేసవిలో తట్టు, కామెర్లు వచ్చే ప్రమాదాన్ని తగ్గిస్తుంది. కల్లులోని పొటాషియం వంటి ఎలక్ట్రోలైట్లు శరీరాన్ని హైడ్రేటు గా ఉంచుతుంది. ఇందులో సహజ చక్కెరలు మీకు త్వరగా త్వరగా శక్తినిస్తాయి వేసవిలో మిమ్మల్ని తాజాగా ఉంచుతాయి. ఇందులో విటమిన్లు యాంటీ ఆక్సిడెంట్ యాక్సిడెంట్లు కణాలలోని ఫ్రీ రాడికల్స్ ను తొలగించి చర్మం లో కొల్లాజెన్ ఏర్పడ్డాన్ని ప్రోత్సహిస్తాయి.

వేసవిలో కూడా మీ చర్మం సురక్షితంగా ఉంచుతుంది తాటికల్లు మన ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది డయేరియా టైఫాయిడ్ వంటి వ్యాధులకు కారణం అయ్యే వైరస్లకు తాటికల్లు యాంటీబయోటిక్ గా పనిచేస్తుంది ఎముకలు ఆరోగ్యానికి మేలు చేస్తుంది నీటిలోని కాలుష్యం,మెగ్నీషియం వంటి ఖనిజాలు ఎముకలను బలోపేతం చేస్తాయి ఆస్టియోపోరోసిస్ ఎముక సంబంధిత వ్యాధులను నివారిస్తాయి అని నిపుణులు తెలియచేస్తున్నారు.

# ఊసరవెల్లి రాజకీయాలు మానుకో ముఖ్యమంత్రి

**- ఎంజెఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి: బాబు మాదిగ**



**మఠంపల్లి/మార్చి18(జర్నలిస్ట్ వార్త):** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ పిలుపు మేరకు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారం తొమ్మిదవ రోజుకు చేరుకున్నాయి. ఎమ్మార్పీఎస్ మఠంపల్లి మండల అధ్యక్షులు ఇరుగు ప్రభు అధ్యక్షతన చేపట్టిన సమావేశానికి ఎంజెఎఫ్ ముఖ్య నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంజెఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి దేవపంగు బాబు మాట్లాడుతూ సుప్రీం కోర్టు ఎస్సి వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చినప్పటికి అమలు చేయకుండా ముఖ్యమంత్రి డొంక తిరుగు రాజకీయాలు ప్రదర్శిస్తున్నారని అన్నారు. గ్రూప్ 1,2,3 ఫలితాలు వెల్లడించి, ఉద్యోగ నియామకాలకు నోటిఫికేషన్ జారీ చేయడం సుప్రీం కోర్టు తీర్పును దిక్కరించటమేనని వారు భావించారు. ఇప్పటికైనా తెలంగాణ రాష్ట్రం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఊసరవెల్లి రాజకీయాలు మానుకోవాలని హెచ్చరించారు. వర్గీకరణ అమలు కోసం చేపట్టిన దీక్షకు వివిధ సంఘాల నేతలు సంఘీభావం తెలిపి దీక్షలో భాగస్వాములైనారని పేర్కొన్నారు. ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసు గోపి మాదిగ, ఎంజెఫ్ జిల్లా సంయుక్త కార్యదర్శి కొమ్ము మహేష్ మాదిగ, ఎంజెఫ్ హుజుర్ నగర్ నియోజకవర్గ అధ్యక్షులు బయ్యారపు రవీంద్ర మాదిగ మాట్లాడుతూ అసెంబ్లీలో ఎస్సి వర్గీకరణపై చర్చ జరుగుతుండగానే గ్రూప్స్ ఫలితాలు వెల్లడించడం యావత్తు మాదిగ జాతిని అవమానించడమేనని అన్నారు. వర్గీకరణ అమలు చేయకపోతే చేపట్టిన దీక్ష రానున్న రోజుల్లో మరింత ఉద్రుక్తం చేస్తామని హెచ్చరించారు. ఎంజెఎఫ్ మండల అధ్యక్షులు పల్లె సుధాకర్, చిలక సైదులు, ఎంఎస్పి మండల అధ్యక్షులు కస్తాల వెంకటేశ్వర్లు, పిఎసిఎస్ మాజీ చైర్మన్ ద్వైద రాయేలు, ఎమ్మార్పీఎస్ మండల సీనియర్ నాయకులు కుర్రి శ్రీను, చిన్నపంగు నరేందర్, మంద రమేష్, ఎమ్మార్పీఎస్ మఠంపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు కూరాకుల సైదులు, కూరాకుల నర్సయ్య, కొత్తపల్లి గణేష్, పొట్టేపంగు అశోక్, కుర్రి నాగేశ్వరరావు, గుండెపంగు సైదులు, గుండెపంగు సురేష్, ఉబ్బపల్లి శ్రీను, గుండెపంగు కృష్ణయ్య, అశోక్, మాదిగ ఉద్యోగుల సమాఖ్య మండల నాయకులు అమరారపు దేవబిక్షం, మేడి బుంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

**- నియోజకవర్గ ఇన్చార్జి ఝాన్సీ రెడ్డి**



రాయపర్తి/మార్చి18(జర్నలిస్ట్ వార్త):
బాధిత కుటుంబాలకు అండగా ఉంటానని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్చార్జి హను మాండ్ల ఝాన్సీరాజేందర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలో ఇటివల మృతి చెందిన పలు మృతుల కుటుంబాలను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం బాలునాయక్ తండా గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సమ్మయ్య నాయక్ సతీమణి ఇటీవల ఆపరేషన్ చేయించుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటుండగా ఆమెను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ మాజీ కార్యదర్శి బిల్లా సుదీర్ రెడ్డి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోత్ హమ్యా నాయక్, మండల అధ్యక్షుడు ఈదులకంటి రవీందర్ రెడ్డి, ముద్దుల పేట మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సరికొండ కృష్ణారెడ్డి, పాలకుర్తి సోమేశ్వర్ ఆలయ చైర్మన్ టి కృష్ణమాచార్యులు,యూత్ అధ్యక్షుడు బొమ్మెర కళ్యాణ్,మండల మహిళా అధ్యక్షురాలు ఊగ మునిత,న%శీ%గునూరి అశోక్,మచ్చ నిలయ్య, ముద్రబోయిన వెంకటేశ్వర్లు,రెంటాల గోవర్ధన్ రెడ్డి, చిర్ర మల్లయ్య, ఉల్లెంగుల యాదగిరి,ఉల్లెంగుల నర్సయ్య,కుంట రమేష్, గారె బిక్షపతి, ఎసిరెడ్డి శ్రీనివాసరెడ్డి,ఐరెడ్డి ఎల్లా రెడ్డి,ఎండీ గౌస్ ఖాన్,తదితరులు పాల్గొన్నారు.

# పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించాలి




**రాయపర్తి/మార్చి18(జర్నలిస్ట్ వార్త):**
విద్యార్థులు పదిలో మంచి ఫలితాలు సాధించాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గారే కృష్ణమూర్తి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ, తరగతి విద్యార్థుల వీడుకోలు సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు గత పది సంవత్సరాలుగా విద్యా ప్రమాణ స్వీకరించి 10వ, తరగతిలో మంచి ఫలితాలు సాధించి భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలని కోరారు. అనంతరం సమాజంలో మానవతా విలువలు క్షీణించిపోతున్న సందర్భంగా పెద్దలను, తల్లిదండ్రులను గౌరవించే విధంగా ఉండాలని విద్యార్థులకు తల్లిదండ్రులకు ఆశీస్సులు ఉండాలని పాదాభివందనం చేశారు. తల్లిదండ్రుల చేతుల మీదుగా హాల్ టికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రోజారాణి,బి ఉప్పలయ్య,పి సురేందర్,ఎస్వీబీ శర్మ,జి ప్రవీణ్ రెడ్డి,ఎన్ రాధా స్వామి సంధ్య,నరసింహులు,సి ఆర్ పి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# త్రాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేయండి

### -జిల్లా కలెక్టర్ ని కలిసిన కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి బృందం

### -గ్రామాల్లోకి వెళ్లి పరిస్థితులను చక్కదిద్దాలని అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్



**బోథ్/మార్చి18(జర్నలిస్ట్ వార్త):** బోథ్ నియోజకవర్గ వ్యాప్తంగా తాగునీటి ఎద్దడిని పరిష్కరించాలని, ఈ ప్రాంతాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలని, ఉపాధి హామీ పని దినాలు పెంచాలని కాంగ్రెస్ పార్టీ ప్రతినిధుల బృందం ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షి షాని మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మిషన్ భగీరథ నీటి సరఫరా పెంచాలని ప్రస్తుతం వస్తున్న నీరు మానవ అవసరాలకు, పెంపుడు జంతువులకు సరిపోవటం లేదని, గ్రామాలకు దగ్గర అందుబాటులో ఉన్న రైతుల పొలాలలో నుంచి నీటిని గ్రామ ప్రజల అవసరాలకు వినియోగించేలా చర్యలు తీసుకోవాలని కోరడం జరిగింది పర్వత ప్రాంతాల్లో నీటి నిల్వలు పెంచడానికి చెక్ డాంలను కుంటలను ఏర్పాటు చేయాలని అన్ని అనుమతులు వచ్చే విధంగా పంచాయతీరాజ్ ఫారెస్ట్ రెవెన్యూ అధికారులను ఆదేశించాలని, కేంద్ర ప్రభుత్వం నుంచి కంపానిధులు వచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా స్పందిస్తూ అక్కడే ఉన్న మిషన్ భగీరథ అధికారులను, మండల ఎంపీడీవో లను తక్షణమే గ్రామాల్లోకి వెళ్లి ప్రజలకు తాగునీటి అవసరాలు తీర్చే విధంగా చర్యలు తీసుకోవాలని వాటికి సంబంధించిన నివేదికలు ఇవ్వాలని అధికారులను ఆదేశించారు

ఈ కార్యక్రమంలో బోథ్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భోడ్డు గంగారెడ్డి, ఇచ్చోడా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోమురం సత్యవతి కోటేశ్వర్, అదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పసుల చంటి, బోథ్ పిఎసిఎస్ డైరెక్టర్ గొర్ల రాజు యాదవ్, షేక్ అబుద్, జ్యోతిరాం తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులు అమలు పై ప్రత్యేక కార్యాచరణ

### -జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్





**ఖమ్మం/మార్చి18(జర్నలిస్ట్ వార్త):** రాబోయే 10 రోజుల పాటు ప్రత్యేక కార్యాచరణతో ఉపాధి హామీ పనులను జిల్లాలో అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ ఉపాధి హామీ పనులపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ జిల్లాలో ఉపాధి హామీ పథకం క్రింద కేటాయించిన పనుల లక్ష్యాలను చేరుకునేందుకు కృషి చేయాలని తెలిపారు. జిల్లాలోని అటవీ ప్రాంతాలలో ట్రెంచ్, ఫీల్డ్ చానల్స్, చెరువు కాల్వల పూడిక తీత, మొదలగు పనులను రాబోయే 10 రోజులలో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ఉపాధి హామీ క్రింద చేపట్టాలని, వీటి ద్వారా మన లక్ష్యాలను పూర్తి చేసుకోవాలని అన్నారు. అటవీ భూములకు బౌండరీ ట్రెంచ్ లు ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి హామీ కూలీలకు పని దొరకడంతో పాటు అటవీ భూముల సంరక్షణ, వివాదాలను తగ్గించేందుకు ఉపయోగపడుతుందని, అటవీ ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో ట్రెంచింగ్ చేసేందుకు ప్రతిపాదనలు సమర్పించాలని కలెక్టర్ అన్నారు. రైతులను భాగస్వామ్యం చేస్తూ వారికి అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని అన్నారు. అటవీ ప్రాంతంలో వాటర్ అబ్జర్వింగ్ మొక్కల పెంపకం ద్వారా భూగర్భ జలాలు పెరుగుతాయని అన్నారు. వ్యవసాయ శాఖ క్రింద కొత్త పంట కాలువలు, ఫామ్ పాండ్ల ను గుర్తించి ప్రతిపాదనలు అందిస్తే వెంటనే మంజూరు చేసి 24 గంటలలో పనులు ప్రారంభించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. భూగర్భ జలాలు తగ్గిపోతున్న ఖమ్మం రూరల్, కూసుమంచి, నేలకొండపల్లి తిరుమలాయపాలెం, వైరా, ఏన్కూర్, సింగరేణి మండలాలలో 15 చొప్పున రేయిన్ హార్వెస్టింగ్ పిట్ లను ఏర్పాటు చేయాలని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్షేత్రస్థాయిలో రైతులతో సంప్రదించి ఆసక్తి గల వారి పొలాల్లో ఫామ్ పాండ్ ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని, మండలానికి కనీసం 5 ఫామ్ పాండ్లు ఏర్పాటు కావాలని అన్నారు. జిల్లాలో హార్టికల్చర్ క్రింద పంటలను పెంచేందుకు కూడా ఉపాధి హామీ పథకం వినియోగించుకోవాలని అన్నారు. ఆయిల్ పామ్ క్రింద ట్రెంచింగ్ ఏర్పాటు మంజూరు చేసిన పనులను త్వరగా పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. నీటిపారుదల శాఖ క్రింద ఫీల్డ్ చానల్స్, నీటి కాల్వలను శుభ్రం చేయాలని అన్నారు. ప్రతి మండలంలో రెవెన్యూ శాఖకు సంబంధించిన 20 స్థలాలు, హార్టికల్చర్ పరిధిలో 20 స్థలాలు , వ్యవసాయ శాఖ తరపున రెయిన్ హార్వెస్టింగ్ పిట్లను నిర్మించేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. మనం నేడు చేపట్టే కార్యాచరణ ద్వారా భవిష్యత్తులో భూగర్భ జలాలను పెంపొందించేందుకు ఉపయోగపడుతుందని అన్నారు. జిల్లాలో నిధులు అందుబాటులో ఉన్న గ్రామ పంచాయతీలలో అవసరమైన సామాజిక ఇంకుడు గుంతలు, డ్రైయిన్ నిర్మాణ పనులను గుర్తించాలని, వీటిని వెంటనే మంజూరు చేసి మూడు రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో కనీసం 40 గ్రామాలలో ఈ పనులు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. తిరుమలాయపాలెం మండలంలో అత్యధికంగా డెంగ్యూ కేసులు గతంలో నమోదయ్యాయని, రాబోయే కాలంలో ఇవి పునరావృతం కాకుండా ఎక్కడ నీటి నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, డిఆర్వో ఏ. పద్మశ్రీ, డిఆర్డిఓ సన్యాసయ్య, వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, పంచాయతీ రాజ్ ఈఈ వెంకట్ రెడ్డి, డిఎల్పిఓ రాంబాబు, ఎంపీడీఓ లు, అటవీ, ఉద్యానవన శాఖ అధికారులు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉప్పలమ్మా పూజారి హత్య కేసులో నిందితులకు జీవిత ఖైది





**కల్లూరు/మార్చి18(జర్నలిస్ట్ వార్త):** మండల పరిధిలో చెన్నూరు గ్రామానికి చెందిన పాటిబండ్ల శ్రీనివాసరావు అనే ఉప్పలమ్మ పూజారి హత్య కేసులో నిందితులకు జీవిత ఖైది విదిస్తూ జిల్లా 6వ అదనపు జిల్లా జడ్జి సత్తుపల్లి వారు మంగళవారం తీర్పు ఇవ్వడం జరిగింది. పాటిబండ్ల శివ ఇంటిలో కొన్ని సమస్యలు ఉండగా, అతని ఇంటిలో పశువులు చనిపోయినందున నూతలపాటి నారాయణరావు అను అతను తల్లాడ మండలం మల్లారం గ్రామానికి చెందిన పాస్తం రంగారావు అను వ్యక్తిని కలిపి సమస్య చెప్పగా, శివ యొక్క ఇంటిలో సమస్యలకి, పశువులు చనిపోవడానికి ఉప్పలమ్మా పూజలు చేసే పాటిబండ్ల శ్రీనివాసరావు అనే వ్యక్తి కారణమఅని రెచ్చగొట్టి, అతడిని చంపితేనే ఇంట్లో సమస్యలు తీరుతాయని చెప్పడంతో గత నెల 19.02.2023 న పాటిబండ్ల శ్రీనివాసరావు చెన్నూరు గ్రామ శివారులో పొలం వద్ద ఉండగా పాటిబండ్ల శివ అక్కడికి వెళ్ళి అతడిని అతి కిరాతకంగా నరికి చంపినందున మరించాడు అని రుజువు అయినందు వల్ల ముద్దాయిలు ఎ 1 గా పాటిబండ్ల శివ, ఎ5 పస్తం రంగారావులకు, వారికి సహకరించిన పాటిబండ్ల నారాయణరావు, కుటుంబ సబ్యులపై దర్యాప్తు చేసిన అధికారి అయిన సి హెచ్.హనూక 04.05.2023 న చార్జి షీట్ దాఖలు చేయగా, విచారించి ఎ1 శివ,ఎ5 పస్తం రంగారావు లకి జీవిత ఖైదు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చినారు. ఇట్టి కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ యస్.కే.అబ్దుల్ బాష సరైన వాదనలు బలముగా వినిపించగా, దర్యాప్తు అధికారి సి.హెచ్.హనోక్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఎస్సై.పి.రఘు, ప్రస్తుత సీఐ ముత్తులింగయ్య, ఎస్సై హరిత కోర్టు కానిస్టేబుల్ మల్లికార్జున్, ప్రాసెస్ కానిస్టేబుల్ సుందరం సహకరించినారు.

ఈ కేసు లో ముద్దాయిలకి శిక్ష పడినందున మృతుడి బార్య అయిన పాటిబండ్ల కృష్ణమ్మ,కుమార్తె రమ్య లను కమిషనర్ ఆఫ్ పోలీస్ ఖమ్మం ని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మహిళలు అయివుండి బయం లేకుండా దైర్యంగా పిర్యాదు ఇచ్చి, సాక్ష్యం చెప్పినందున కమిషనర్ వారిని అభినందించారు.

# రాజలింగమూర్తి హత్య కేసులో ప్రధాన నిందితుని అరెస్ట్

### - సహకరించిన మరో ఇద్దరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



**భూపాలపల్లి/మార్చి18(జర్నలిస్ట్ వార్త):** భూపాలపల్లి పట్టణంలో నాగవెల్లి రాజలింగమూర్తి హత్యకు గురైన సంగతి తెలిసిందే. కేసులో ప్రధాన నిందితుడైన కొత్త హరిబాబు అనే అతన్ని భూపాలపల్లి పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. హరిబాబు పారిపోవడానికి సహకరించిన ములుగు జిల్లాకి చెందిన వట్టే రమణయ్య, రమ అనే మరో ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసిన పోలీసులు కోర్టులో హాజరు పరిచారు. ఈ నేరస్తులను అరెస్ట్ చేయడానికి మూడు ప్రత్యేక బృందాలు ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టాయి. ఢిల్లీ, జైపూర్, ఆగ్రా తదితర ప్రాంతాలలో తనిఖీలు నిర్వహించి ప్రత్యేక బృందాలు చివరికి నిందితుని ఆచూకీ ఛేదించాయి. తక్షణ చర్యల్లో భాగంగా వారిని పోలీసులు అరెస్టు చేశారు. ముందస్తుగా అరెస్ట్ అయిన నిందితులను మరల పోలీస్ కస్టడీలోకి తీసుకొని, పూర్తిస్థాయిలో విచారించి, తదుపరి చర్య తీసుకోబడునని భూపాలపల్లి పోలీసులు చెబుతున్నారు. మృతుని హత్య కేసులో ఇంకా ప్రచారం జరుగుతుంది. హత్యకు గల కారణాలపై రకరకాలుగా చర్చించుకుంటున్నారు. ఒకప్రక్క పోలీసుల విచారణలోభూమి తగాదా విషయమై హత్య చేయబడినట్లు నిందితుల స్టేట్ మెంట్ పోలీసులు వెల్లడించారు. అదే సమయంలో మరోప్రక్క మృతుని భార్య విలేకరుల సమక్షంలో ఇచ్చిన స్టేట్ మెంట్ మరో మలుపు తిరిగింది. గత కొంతకాలం క్రితం తన భర్త మేడిగడ్డ విషయమై కోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. ఆ కేసు తెల్లవారితే కోర్టు వాయిదా ఉండగా తన భర్త హత్య చేయబడ్డారని తెలిపారు. తన భర్త హత్య భూమి విషయంలో కాదని, రాజకీయ కుట్రలో భాగంగానే తనను హతమార్చారని ఆమె అభిప్రాయాన్ని వెల్లడించారు. హత్య కేసులో నిందితులనైతే పట్టుకుని కోర్టులో హాజరు పరిచారు కానీ, మృతుని భార్య చేసిన ఆరోపణలకు ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత లభించలేదు.

# ప్రశాంత వాతావరణంలోపరీక్షలు రాయాలి

### - సత్తుపల్లి ఎంఈఓ రాజేశ్వరరావు



**సత్తుపల్లి/మార్చి18(జర్నలిస్ట్ వార్త):** మార్చి 21 నుంచి ఏప్రిల్ 2వ తేదీ వరకు జరగనున్న పదో తరగతి పరీక్షలు ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాయాలని సత్తుపల్లి మండల విద్యాశాఖ అధికారి నక్కా రాజేశ్వరరావు కోరారు. మంగళవారం మండల కేంద్రంలో మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షల సమయంలో జరిగే పుకార్లు, అసత్య ప్రచారానికి తావు ఇవ్వవద్దని విజ్ఞప్తి చేశారు. పరీక్షా కేంద్రాలలో ఎక్కడ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే వెంటనే సమస్య పరిష్కరిస్తానని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు తెలియజేశారు. పరీక్షలు రాయనున్న విద్యార్థులు వత్తిడికి గురి కాకుండా చూడాలని సూచించారు. సత్తుపల్లి పట్టణంలో 5 పరీక్ష కేంద్రాల్లో 917 మంది, గంగారం పరీక్షా కేంద్రంలో118 మంది విద్యార్థులు10వ తరగతి పరీక్షలు రాయనున్నట్లు తెలిపారు. ఈ సంవత్సరం నుంచి మొదటిసారిగా 24 పేజీల బుక్లెట్ (రూల్స్ పేజీలు) ఇవ్వడం జరుగుతుందాన్నారు. పేజీకి 25 లైన్స్ వరకు ఉంటాయి. ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్ష నిర్వహిస్తారన్నారు. మొదటి రోజు గంట ముందుగా, మిగిలిన పరీక్షలకు 30 నిమిషాల ముందుగా పరీక్షా కేంద్రంలోనికి అనుమతిస్తారని తెలిపారు.

## మృతుల కుటుంబాలకు ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శ



**రాయపర్తి/మార్చి18(జర్నలిస్ట్ వార్త):** మండల కేంద్రానికి చెందిన ఐత వెంకన్న,మైలారం గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు బాధ రవి సోదరుడు బాధ వెంకన్న ఇటీవల మరణించగా మంగళవారం మృతుల చిత్ర పటాలలు పూల మాలలు వేసి నివాళ్లు అర్పించి కుటుంబాలను మాజీ మంత్రి,పాలకుర్తి బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఎర్రబెల్లి దయాకర్ రావు పరామర్శించి ప్రగాఢ సానుభూతినీ తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు మునావత్ నర్సింహ నాయక్, మాజీ జడ్పీటిసి రంగు కుమార్ గౌడ్,మండల ప్రధాన కార్యదర్శి పూస మధు,లెతాకుల రంగా రెడ్డి, గారే నర్సయ్య,ఐత రాంచందర్,బందేల బాలరాజు,ముద్రబోయినా సుధాకర్,చందు రాము యాదవ్,చిన్నాల రాజబాబు,భాషబోయిన సుధాకర్,కోల సంపత్,సంకినేని ఎల్లస్వామి,ఎండీ అష్రఫ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలి

### -వర్ధన్నపేట సిఐ శ్రీనివాస్




**రాయపర్తి/మార్చి18(జర్నలిస్ట్ వార్త):** విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరాలని వర్ధన్నపేట సీఐ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని మహాత్మ హై స్కూల్ లో నిర్వహించిన పదవ తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్దులు కష్టంగా కాకుండా ఇష్టంగా పరీక్షలు రాయాలని అన్నారు. మంచి ఫలితాలు సాధించింది తల్లిదండ్రులకు,చదువుకున్న పాఠశాలకు పేరు తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రవణ్ కుమార్, సంస్కృతిక కళాకారుడు గిద్దె రాంనర్సయ్య,పాఠశాల డైరెక్టర్ కుంట రమేష్,పాఠశాల ప్రధానోపాధ్యాయులు సరికొండ శ్రీనివాస్, ఉపాధ్యాయులు సుధాకర్, దయాకర్,రవీందర్, రమేష్ అనిత, సరిత, పద్మ, శైనిక తదితరులు పాల్గొన్నారు.

# కృత్యాధార పద్ధతిలో బోధన విద్యార్థులకు మేలు

### - ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు మధుసూదన్



**ఖిలావరంగల్/మార్చి18(జర్నలిస్ట్ వార్త):** కృత్యాధార పద్ధతి విద్యార్థులకు బోధించడం వారికి మేలు జరుగుతుందని ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు పి. మధుసూదన్ అన్నారు. ట్రస్మా (వడుప్సా), సైన్స్ అకాడమీ, టెక్ మహేంద్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో వరంగల్ ఉమ్మడి జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు 4 రోజుల శిక్షణ ముగిసింది. మంగళవారం వరంగల్ నగరంలోని ఉర్సుగుట్ట వద్ద గల జేఎస్ఎం పాఠశాలలో ట్రస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ రమేష్ రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరై శిక్షణలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సర్టిఫికెట్లలను అందజేసిన అనంతరం ఆయన మాట్లాడారు. కృత్యాధార పద్ధతితో విద్యార్థులకు బోధించడం, వారికి ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులకు అందుబాటులో ఉన్న వస్తువులతో బోధించడం విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి పెరుగుతుందన్నారు. ట్రస్మా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమేష్ రావు మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలోనే ప్రైవేటు పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం ట్రస్మాకే సాధ్యమైందని ధీమా వ్యక్తం చేశారు. శిక్షణ తీసుకున్న ఉపాధ్యాయులు తమ తమ పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు వారు నేర్చుకున్న శిక్షణ పద్ధతులతో బోధించి, విద్యార్థుల భవిష్యత్తుకు పునాదులు వేయాలని కోరారు. ఈ శిక్షణ కార్యక్రమానికి ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ పి స్రవంతి, రిసోర్స్ పర్సన్స్ డాక్టర్ తుర్కీ, డాక్టర్ రేవతి, డాక్టర్ సత్యానంద్, అబూబకర్, అమీర్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర కోశాధికారి రాఘవేందర్ రెడ్డి, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ టామీ, ఉపాధ్యక్షుడు రాధాకృష్ణ, కార్యవర్గ సభ్యులు సురేష్, హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్, వరంగల్ జిల్లా ఉపాధ్యక్షులు మచ్చిక వెంకటేశ్వర్లు, ప్రెస్ అండ్ మీడియా కన్వీనర్ పంచకం నర్సయ్య, వర్ధన్నపేట మండల జోన్ ప్రధాన కార్యదర్శి హరికుమార్, వివిధ పాఠశాలల కరస్పాండెంట్లు, 60 మంది సైన్స్ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ వార్త

బుధవారం 19 మార్చి 2025

# రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

## - హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**హనుమకొండ/మార్చి18(జర్నలిస్ట్ వార్త):** ఆపదలో ఉన్న వారికి దాతలు రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని జిల్లా ఖజానా శాఖ కార్యాలయ ప్రాంగణం వద్ద తలసేమియా బాధితుల కోసం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ ప్రావీణ్య రక్తదానం చేసి ఉద్యోగులకు, దాతలకు స్ఫూర్తిగా నిలిచారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ తలసేమియా బాధితుల కోసం మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. ఆ రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేసిన అధికారులను కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. అనంతరం రక్తదాతలకు కలెక్టర్ చేతుల మీదుగా ధ్రువపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి, జిల్లా ఖజానా శాఖ అధికారి ఆకవరం శ్రీనివాస్ కుమార్, డిఆర్డిఓ మేన శ్రీను, బీసీ సంక్షేమ శాఖ అధికారి రామ్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పంప్ హౌస్ మోటార్ల ప్రారంభానికి విచ్చేసిన మంత్రులు

## - స్వాగతం పలికిన హనుమకొండ అధికారులు



**హనుమకొండ/మార్చి18(జర్నలిస్ట్ వార్త):** హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం దేవన్నపేట గ్రామ శివారు లోని దేవాదుల పంప్ హౌస్ మోటార్ల ప్రారంభానికి మంగళవారం మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విచ్చేశారు. వారి వెంట స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి, సాగునీటిపారుదల శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఉన్నారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లాకు చెందిన అధికార యంత్రాంగం ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, తెలంగాణ రాష్ట్ర ఆయిల్ సీడ్స్ గ్రోవర్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కుడా ఛైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిడబ్ల్యూఎంసి కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, దేవాదుల అధికారులు తదితరులు పాల్గొన్నారు.


# సుధీర్‌రెడ్డిపై అట్రాసిటీ కేసు

**హైదరాబాద్,మార్చి18(జర్నలిస్ట్ వార్త):**



బీఆర్ఎస్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిపై అట్రాసిటీ కేసు నమోదైంది. హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాత నాయక్ మీద అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు ఆయనపై ఎస్సీ-ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు ఎల్బీనగర్ పోలీసులు. క్రైమ్ నంబర్ 254/2025, ఎస్సీ/ఎస్టీ యాక్ట్ 1989 కింద కేసు నమోదు చేశారు. కాగా, ఈ వివాదం ప్రోటోకాల్ దగ్గర మొదలైంది. మార్చి 12న మన్సూరాబాద్ డివిజన్‌లో సుధీర్ రెడ్డి పలు డెవలప్‌మెంట్ వర్క్స్‌కు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులకు మన్సూరాబాద్ బీజేపీ కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి తిరిగి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే చేసిన అనంతరం అవే పనులకు మళ్లీ కార్పొరేటర్ శంకుస్థాపన చేయడంపై బీఆర్ఎస్ కార్యకర్తలు సీరియస్ అయ్యారు. ఆ పనులను అడ్డుకునే ప్రయత్నం చేశారు. ఆ తర్వాత అదే డివిజన్‌లో మరోచోట ఇలాగే శంకుస్థాపన చేసేందుకు ప్రయత్నించగా.. బీఆర్ఎస్ నేత జక్కిడి రఘువీర్ రెడ్డి నిరసన తెలిపారు. వాళ్లను అరెస్ట్ చేసిన పోలీసులు.. అబ్దుల్లాపూర్ మెట్ పీఎస్‌కు తరలించారు.

# పదో తరగతి విద్యార్థులకు వీడుకోలు





**వర్ధన్నపేట/మార్చి18(జర్నలిస్ట్ వార్త):** వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామ ప్రభుత్వ పాఠశాలలో వీడుకోలు సమావేశం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు విజయ అధ్యక్షతన 9వ, తరగతి విద్యార్థుల ఆద్వర్యంలో చేపట్టిన కార్యక్రమంలో విద్యార్థులు పదో తరగతి విద్యార్థులు ఆనందోత్సవాల నడుమ సంబరాలు జరుపుకున్నారు. అనంతరం ప్రాథమిక దశ నుంచి పదో తరగతి వరకు గడిచిన తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటూ ఒకరిని మరొకరు ఓదార్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయునీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పరపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో

# 10వ తరగతి విద్యార్థులకు వీడ్కోలు

**-విద్యార్థులందరూ క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలి -హెచ్ ఎం తేజావత్ జయ**





**చెన్నారావుపేట/మార్చి18(జర్నలిస్ట్ వార్త):** చెన్నారావు పేట మండలం ఉప్పరపల్లి జిల్లా పరిషత్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు తేజావత్ జయ అధ్యక్షతన 10వ తరగతి విద్యార్థిని విద్యార్థులకు వీడ్కోలు సమావేశాన్నిమంగళవారం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి హెచ్ ఎం జయ మాట్లాడుతూ, వీడ్కోలు అనేది సహజమని, విద్యార్థులందరూ 10వ తరగతి పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించి తల్లిదండ్రులకు, చదువు చెప్పిన ఉపాధ్యాయులకు మంచి పేరు ప్రఖ్యాతులను తీసుకు రావాలని సూచించారు. చదువులకు వెళ్లాలంటే పదవ తరగతి పరీక్షల్లో వచ్చే మార్కులే అవసరం పడతాయని, అందుకు ప్రతి ఒక్క విద్యార్థి పరీక్షల్లో అధిక మార్కులను సాధించాలని, పరీక్షలకు సమయం దగ్గర పడుతున్నందున సమయాన్ని వృధా చేయరాదని తెలిపారు. విద్యార్థులు ఆటపాటలతో పాఠశాల తోటి విద్యార్థులను,పాఠశాల ఉపాధ్యాయ బృందాన్ని అబ్బురపరిచారు. ఈ సందర్భంగా వీడ్కోలు పొందుతున్న పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులు మాట్లాడుతూ, ఉపాధ్యాయులను, పాఠశాలను వదిలి వెళ్లాల్సి రావడం బాధాకరమని, ఉపాధ్యాయులు విద్యను బోధించడం కోసం ఎంతో కృషి చేశారని, మేము అల్లరి చేసిన వాళ్లు భరించి మమ్మల్ని వాళ్ళ పిల్లల మాదిరిగా చూశారని ఉపాధ్యాయులకు ధన్యవాదాలు తెలుపుతున్నామని, అలాగే పరీక్షల్లో మంచి మార్కులు సాధించి పై చదువుల్లో మంచిగా చదువుకొని పేరు ప్రఖ్యాతలు తెచ్చుకుంటామని అన్నారు. ఉపాధ్యాయులు మాట్లాడుతూ, పిల్లలు పాఠశాలను వదిలి వెళ్తున్నారంటే తమకు కూడా చాలా బాధగా ఉందని, ఎక్కడ ఉన్నా సొంత పిల్లలా మేము భావిస్తామని,వాళ్లు మంచి స్థానంలో ఉన్న రోజే చాలా ఆనందపడతామని వీడ్కోలు పొందుతున్న పిల్లల్ని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సునీత, శశిధర్, సంతోష్ కుమార్ ,పిన్నింటి బాలాజీ రావు, ఉదయ్ కుమార్, సిహెచ్ మాధవి, ఎల్ మొగిలి,కె.మాధవి, జి. సుందర్ , వర్ధెల్లి సతీష్ కుమార్, రమాదేవి,వ్యాయామ ఉపాధ్యాయురాలు వీరగొని స్వప్న పాల్గొన్నారు. పదవ తరగతి విద్యార్థులు తమ జ్ఞాపకార్థం పాఠశాలకు బీరువాను బహుకరించారు.

# కుష్టు వ్యాధి నిర్మూలనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

## -భూపాలపల్లి వైద్య అధికారి డాక్టర్ మధుసూదన్





**భూపాలపల్లి/మార్చి18(జర్నలిస్ట్ వార్త):** కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ పిలుపునిచ్చారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమములో భాగంగా ఈనెల 17 నుంచి 30 వరకు జిల్లా వ్యాప్తంగా నిర్వహించే సర్వేకు సహకరించాలని కోరారు, మంగళవారం తన కార్యాలయము నందు జరిగిన సమీక్ష సమావేశంలో కుష్టి వ్యాధి గురించి తెలియజేశారు. శరీరంపై తెల్లని మరియు ఎర్రని రాగి రంగు మచ్చలు ఉండి స్పర్శ లేకుండా మొద్దు భారీ ఉండడం, ముఖంపై నూనె పోసినట్లు మెరుస్తూ ఉండడం, దద్దుర్లు రావడం, అరికాలు అరచేతుల్లో తిమ్మిర్లు రావడం, కనురెప్పలు సరిగా మూసుకోకపోవడం, లాంటివి కుష్టు లక్షణాలని తెలిపారు. ఇంటింటి సర్వేలో ఇలాంటి లక్షణాలు ఉన్న వారిని గుర్తించి సమీప పీహెచ్సీలలో వైద్య పరీక్షలు నిర్వహిస్తారు కుష్టువ్యాధితో చేతివేళ్లు వంకర పోవడం, ఫుడ్ డ్రాప్ సమస్య ఉన్నవారికి ఉచితంగా శస్త్రచికిత్సతో వ్యాధిని నయం చేయొచ్చని తెలిపారు. అలాంటి వ్యాధి గ్రస్థులకు ప్రభుత్వం 12 వేల రూపాయలు చొప్పున అందిస్తుందని అన్నారు. వ్యాధి లక్షణాలు ఉంటే వెంటనే ఎం డి టి చికిత్స అందిస్తారని, వ్యాధి ఏ దశలో ఉన్న సాధారణ వ్యాధి లాంటిదేనని ప్రజలు గమనించాలని ఆందోళన చెందకుండా పీహెచ్సీలో వైద్యులను సంప్రదించాలని తెలియజేశారు. మైకో బ్యాక్టీరియం లేప్రేతో కుష్టు వ్యాధి సోకుతుంది, వ్యాధిగ్రస్తులు తుమ్మిన దగ్గిన తుంపర్ల ద్వారా దగ్గరలో ఉన్న వారికి ఈ వ్యాధి సోకే అవకాశం ఉంటుంది ఈ వ్యాధి ముఖ్యంగా చర్మం, మరియునరాలకు సోకుతుంది,ఇది ఒక రకమైన అంటువ్యాధి కారకం.కుష్టు వ్యాధి సోకిన వ్యక్తికి ఒకటి నుంచి ఐదు మచ్చలు ఉంటే ప్యాసి బ్యాసిల్య్ పిబి గా గుర్తిస్తారు, ఇలాంటి వారికి ఆరు నెలల వరకు చికిత్స ఉంటుంది, కనీసం 9 నెలల కోర్సు పూర్తి చేయాల్సి ఉంటుంది ఐదు కంటే ఎక్కువ మచ్చలు ఉంటే మల్టీ బాసిల్లరీ ఎంబి గా గుర్తిస్తారు అలాంటి వారికి 12 నెలల చికిత్స చేస్తారు, కనీసం 18 నెలల కోర్స్ పూర్తి చేయాలి . బహుళ ఔషధ చికిత్సతో కుష్టును పూర్తిగా నయం చేయవచ్చని రూ. 15000 నుంచి 20వేల వరకు ఖరీదు చేసే మందులను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుంది అని డి ఎమ్ హెచ్ ఓ తెలియజేశారు, ఇంటింటికి వచ్చే ఆరోగ్య కార్యకర్తలకు సహకరించి వ్యాధి లక్షణాలు ఉంటే తెలియజేయాలని ప్రజలకు పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ రవి రాథోడ్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి ఉమాదేవి, డెమో శ్రీదేవి,పారామెడికల్ ఆఫీసర్ మల్లయ్య, ఎమ్ ఎల్ హెచ్ పి లు, సూపర్వైజర్లు, ఆఫీస్ స్టాఫ్ పాల్గొన్నారు.

# లే అవుట్ క్రమబద్ధీకరణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి

## -జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ






**భూపాలపల్లి/మార్చి18(జర్నలిస్ట్ వార్త):** లే అవుట్ క్రమబద్ధీకరణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అన్నారు.

మంగళవారం ఐడిఓసి కార్యాలయ సమావేశపు హాలులో ఎల్ ఆర్ ఎస్ క్రమబద్ధీకరణ ప్రక్రియపై లే అవుట్స్ ఓనర్లు, లైసెన్స్ సర్వేయర్లు, డాక్యుమెంట్ రైటర్స్ తో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సుదీర్ఘకాలంగా పెండింగ్ ఉన్న ఎల్ఎర్ఎస్ (లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం) అమలులో వేగం పెంచాలని సూచించారు.

ఎల్ఆర్ఎస్ పథకం ద్వారా ఈ నెలాఖరు వరకు ఫీజు చెల్లింపులో ప్రభుత్వం 25 శాతం రాయితీ అవకాశం కల్పించిందని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు. ప్లాట్ కొనుగోలుదారులకు ఈ రాయితీని మార్చి 31 వరకు వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. దీంతో పాటు వ్యక్తిగతంగా ప్లాట్లు కొనుగోలు చేసి రిజిస్టర్ చేసుకోని వారికి, లే అవుట్ లో పెద్ద సంఖ్యలో విక్రయం కాకుండా ఉన్న ప్లాట్ల రెగ్యులరైజేషన్ వంటి పలు వెసులుబాట్లు కల్పించినట్లు తెలిపారు. ఒక లే అవుట్ లో 10 శాతం ప్లాట్లు రిజిస్టర్ అయి ఉంటే, మిగిలిపోయిన 90 శాతం ప్లాట్లకు ఎల్అర్ఎస్ పథకంలో రెగ్యులరైజేషన్ కు అవకాశం కల్పించారని, అలాంటి వారికి కూడా మార్చి 31 వరకు 25 శాతం రాయితీ పొందే అవకాశం ఉందని తెలిపారు. ప్లాట్లు కొనుగోలు చేసి సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ కలిగిన వారికి కూడా 31 లోగా ఎస్ఆర్ఎస్ చేసుకుంటే 25 శాతం రాయితీ వర్తిస్తుందని అన్నారు. ప్రజలు, గత నాలుగు సంవత్సరాల నుంచి ఎల్ఆర్ఎస్ కొరకు ఎదురు చూస్తున్నారని, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎల్ఆర్ఎస్ అమలులో పలు వెసులుబాట్లు కల్పిస్తున్న నేపథ్యంలో నిషేధిత జాబితాలో ఉన్న భూముల విషయంలో మాత్రం జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు. సామాన్య ప్రజలు ఇబ్బంది పడకుండా ఎల్ఆర్ఎస్ పథకాన్ని సులభతరం చేయాలన్న ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా పనిచేయాలని దిశా నిర్దేశం చేశారు. ఎల్ఆర్ఎస్ కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా ఎస్ఆర్ఎస్ రెగ్యులరైజేషన్ కోసం సంబంధించి ఏదేని సలహాలు కొరకు మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లాలో 26.8.2020న ఎల్ ఆర్ ఎస్ కు 8312 ఇంటి ప్లాట్లు, 60 లే అవుట్స్ కు దరకాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే 4909 మందికి క్రమబద్ధీకరణ సమాచారం అందినట్లు తెలిపారు. మిగిలిన దరకాస్తులు రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతి రాజ్ శాఖల అధికారులు విచారణ చేయనున్నారని అన్నారు. ఈ సందర్భంగా లే అవుట్స్ ఓనర్లు, లైసెన్స్ సర్వేయర్లు, డాక్యుమెంట్ రైటర్లు సిటిజన్ లాగిన్ లో సాంకేతిక పరమైన ఇబ్బందులు వస్తున్నాయని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, సబ్ రిజిస్ట్రార్ రాము, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, టిపిఓ సునీల్, లే అవుట్ ఓనర్లు, లైసెన్స్ సర్వేయర్లు, డాక్యుమెంట్ రైటర్లు తదితరులు పాల్గొన్నారు.

# మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కల్పించాలి..

**మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలి -గంగారపు శ్రీనివాస్ మాదిగ ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి**



ధర్మసాగర్/మార్చి18(జర్నలిస్ట్ వార్త):ఎస్సీ వర్గీకరణ ద్వారా మాదిగలకు 11 శాతం రిజర్వేషన్స్ కల్పించాలని గంగారపు శ్రీనివాస్ మాదిగ ఎంఎస్పి జిల్లా అధికార ప్రతినిధి హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం సమీపంలో మెయిన్ రోడ్డు వద్ద ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు సోంపెల్లి అన్వేష్ మాదిగ, ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ రిలే నిరాహార దీక్షలు మంగళవారం కు పదో వ రోజుకు చేరుకున్నాయి ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంఎస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్ మాదిగ , ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శాంతి సాగర్ మాదిగ,మాట్లాడుతూ ఈరోజు జరగబోయే అసెంబ్లీ సమావేశంలో ప్రవేశపెట్టబోయే ఎస్సీ వర్గీకరణ కు చట్టబద్ధత కల్పించుటలో జనాభా నిష్పత్తి ప్రకారం మాదిగలకు 11 శాతం రిజర్వేషన్లు కల్పించి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తున్నాం అంతేకాకుండా ప్రభుత్వ ఉద్యోగ నియామకాలు ఫలితాలను కూడా ప్రభుత్వం నిలిపివేయాలని ఎస్సి వర్గీకరణ ద్వారా మాత్రమే చేపట్టాలని మరియు త్వరలో జరగబోయే మంత్రివర్గ విస్తరణలో మాదిగలకు రెండు మంత్రి పదవులు కేటాయించాలని ఈసందర్భంగా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం లేనియెడల గౌరవ శ్రీ మందకృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు ఉద్యమాన్ని ఉధృతం చేసి మాదిగల హక్కులను సాధించుకుంటాము అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు పుట్ట ప్రశాంత్ మాదిగ,ఎమ్మెస్పీ మండల అధ్యక్షులు ఎండి శంషుద్దీన్,వికలాంగుల మండల అధ్యక్షులు మాచర్ల బాబు మాదిగ, ఎమ్మార్పీఎస్ మండల ప్రధాన కార్యదర్శి చిలుక రాజు మాదిగ, మండల నాయకులు బరిగెల ప్రదీప్ మాదిగ,కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ధర్మసాగర్ మాజీ పిఏసిఎస్ చైర్మన్ కుమారుడు గుండె పోటుతో మృతి

**-పరామర్శించిన జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి**





ధర్మసాగర్/మార్చి18 (జర్నలిస్ట్ వార్త):హనుమకొండ జిల్లా ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి గ్రామానికి చెందిన మాజీ పిఏసిఎస్ చైర్మన్ బేరె వీరన్న కుమారుడు నవీన్ కుమార్ మంగళవారం ఉదయం గుండె పోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి హన్మకొండలోని జూలై వాడలో ఉంటున్న వారి నివాసానికి చేరుకొని పార్థివ దేహం నికి పూలామాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం వీరన్నతో పాటు వారి కుటుంబ సభ్యుల కు ప్రగాడ సానుభూతి నీ తెలియజేశారు

# ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ చట్టం తీసుకువచ్చి చట్టబద్ధత కల్పించాలి

**- బిర్రు మహేందర్ మాదిగ ఎంఆర్పిఎస్ ఎంఎస్పి వరంగల్ జిల్లా ఇన్చార్జ్**



వర్ధన్నపేట/మార్చి18(జర్నలిస్ట్ వార్త):పద్మశ్రీ మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు ఎంఆర్పిఎస్ ఎంఎస్పి ఆధ్వర్యంలో వర్ధన్నపేట అంబేద్కర్ సెంటర్ వద్ద రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. మంగళవారం నాటికి దీక్ష 8వ, రోజుకు చేరుకుంది. ఈ కార్యక్రమం ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు ఎర్ర సంతోష్ మాదిగ అధ్యక్షతన నిర్వహించగా ముఖ్య అతిథులుగా ఎంఎస్పి రాష్ట్ర నాయకులు ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి వరంగల్ జిల్లా ఇన్చార్జ్ బిర్రు మహేందర్ మాదిగ హాజరైనారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జరుగుతున్న ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణ కొరకై చట్టం తీసుకువచ్చి రాజ్యాంగ బద్ధంగా చట్టబద్ధత కల్పించాలన్నారు. లేనిపక్షంలో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో విడతల వారీగా ఉద్యమాలకు శ్రీకారం చుడతామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్పి మండల అధ్యక్షులు ముత్యాల మల్లేష్ మాదిగ, మండల అధికార ప్రతినిధి బిర్రు బిక్షపతి మాదిగ, ముత్యాల కొమ్మాలు మాదిగ, ముత్యాల సంజీవ మాదిగ, ముత్యాల నలేందర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు తూల్ల స్వామి మాదిగ, గడ్డం రాజు మాదిగ, గడ్డం శేఖర్ మాదిగ, పృథ్వి మాదిగ, కొత్తూరు అంజి మాదిగ, గుండె శేఖర్ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# రుణమాఫీ కింద లబ్ధి పొందిన రైతులకు కొత్త పంట ఋణాలు మంజూరు చేయాలి

**- డిపాజిట్లు, రుణాల రికవరిపై దృష్టి సారించాలి**

**- నిర్ణీత గడువులోగా లక్ష్యాలను సాధించాలి - టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు**



వర్ధన్నపేట/మార్చి18(జర్నలిస్ట్ వార్త): వర్ధన్నపేట డిసిసిబి బ్యాంక్ లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్ చైర్మన్, డిసిసిబి చైర్మన్ మార్నేని రవీందర్ రావు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రాయపర్తి, నందనం, ఐనవోలు, వర్ధన్నపేట సోసిటీలు, ఐనవోలు, వర్ధన్నపేట డీసీసీబీ బ్యాంకుల మేనేజర్లు, నోడల్ అధికారులు, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్బంగా చైర్మన్ మార్నేని రవీందర్ రావు మాట్లాడుతూ రుణమాఫీ కింద లబ్ధి పొందిన రైతులకు తిరిగి కొత్త పంట ఋణాలు ఇవ్వాలన్నారు. సాంకేతిక కారణాలతో పంట రుణమాఫీ కానీ రైతుల ఖాతాలు మెరుగు పరిచి వారికి మాఫీ లబ్ధి చేకూరేలా చూడాలని చెప్పారు. సంఘాల ద్వారా ఇచ్చి ఉన్న ఋణాలను కూడా లీగల్ గా కవర్ చేసి రికవరీ చేయాలని, నిర్ణీత గడువులోగా బ్యాంకు లక్ష్యాలను వంద శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. డిపాజిట్లు బంగారు రుణాలపై దృష్టి సారించింది బ్యాంకు అభివృద్ధికి సహకరించాలని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో నోడల్ అధికారినీ ఏజీఎం గొట్టం స్రవంతి, బ్రాంచ్ మేనేజర్లు సమత, శ్రావణ్, బద్రునాయక్, నందనం సొసైటీ వైస్ చైర్మన్ చందర్ రావు, వర్ధన్నపేట, రాయపర్తి పాక్స్ చైర్మన్లు రాజేష్ ఖన్నా, రామచంద్ర రెడ్డి, సొసైటీ సీఈఓలు వెంకటయ్య, యాదగిరి, సంపత్, సోమయ్య, సిబ్బంది సురేష్, సమ్మయ్య, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

# దేవాదులను పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

**పంపు హౌస్ మోటార్ల స్విచ్ ఆన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఇక్కడి వచ్చాం -రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**

**హనుమకొండ జిల్లా హసన్పర్తి మండలం దేవన్నపేట శివారులో దేవాదుల పంప్ హౌస్ మోటార్ల ప్రారంభోత్సవానికి రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి వచ్చిన మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి**





**(హనుమకొండ)మార్చి18(జర్నలిస్ట్ వార్త):**

దేవాదుల ఫేజ్ 1,2,3లను పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర సాగునీటి పారుదల,ఆయకట్టు అభివృద్ధి, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ జిల్లా హసన్పర్తి మండలం దేవన్నపేట శివారులోని జె. చొక్కా రావు దేవాదుల ఎత్తిపోతల పథకం ఫేజ్-3, ప్యాకేజ్ -3 భాగంగా నూతనంగా నిర్మించిన దేవన్నపేట పంప్ హౌస్ మోటార్లను రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో కలిసి రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా పంప్ హౌస్ లోని మోటార్లను రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు పరిశీలించారు. దేవాదుల పంప్ హౌస్ కు సంబంధించిన ఫేజ్ 1, 2, 3లకు సంబంధించిన వివిధ అంశాలపై సంబంధిత శాఖల ఉన్నతాధికారులు, అధికారులతో సమీక్షించారు.

అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాష్ట్ర సాగునీటిపారుదల, ఆయకట్టు అభివృద్ధి, ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ, దేవాదుల ప్రాజెక్టు ఫేజ్ 3 కింద పంప్ హౌస్ పనుల పురోగతిపై సమీక్ష,పంపు హౌస్ మోటార్ల స్విచ్ ఆన్ ప్రక్రియను వేగవంతం చేసేందుకు ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు. వాస్తవానికి పంపు హౌస్ మోటార్ల స్విచ్ ఆన్ ప్రారంభ కార్యక్రమం బుధవారం జరగాల్సి ఉందన్నారు. అసెంబ్లీలో బడ్జెట్ సమావేశం, కేబినేట్ సమావేశాలు బుధవారం ఉండటంతో పంపు హౌస్ మోటార్ల స్విచ్ ఆన్ ప్రక్రియను పరిశీలించేందుకు వచ్చినట్లు తెలిపారు. ఎంత రాత్రి అయినా మోటార్ల స్విచ్ ఆన్ ప్రక్రియ పూర్తయిన తర్వాతనే హైదరాబాద్ కు మన్నారు. దేవాదుల ప్రాజెక్టును పూర్తిస్థాయిలో ఫేజ్ 1,2,3లను పూర్తి చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, తాను ఇటీవల కేంద్ర జల వనరుల శాఖ మంత్రి సీఆర్ పాటిల్ ని కలిసినట్లు చెప్పారు. దేవాదుల లాంటి ప్రాజెక్టులకు బ్యాలెన్స్ ఫండ్ ను ఇవ్వాలని కోరినట్లు తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో సరైన విధంగా డాక్యుమెంటేషన్ అసంపూర్తిగా ఉందన్నారు. డాక్యుమెంటేషన్ పూర్తి చేసి బ్యాలెన్స్ ఫండ్ను కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే నిధులతో ప్రాజెక్టు పూర్తి చేసేందుకు దోహదపడుతుంద న్నారు. దేవాదుల ఆయకట్టు కింద వివిధ కారణాల చేత సాగుకు ఇబ్బందులు ఎదురవుతున్న సమాచారం తమకు అందడంతో ఇక్కడికి ఇంత తొందరగా రావాల్సి వచ్చింది అన్నారు. పంటల సాగులో రైతులను తప్పనిసరిగా ఆదుకోవాలని ఉద్దేశంతో ఇక్కడి పంప్ హౌస్ ఆన్ చేయడం ద్వారా నీటిని అందించేందుకు వచ్చామన్నారు. అందుకే ఇక్కడికి వచ్చి అధికారులతో సమీక్ష నిర్వహించి స్విచ్ ఆన్ ప్రక్రియను వేగవంతం చేయడానికి ఈరోజు వచ్చామన్నారు. సాగునీటిపారుదల, సంబంధిత కంపెనీ అధికారులను సమన్వయం చేసి ఎంత రాత్రి అయినా స్విచ్ ఆన్ అయిన తర్వాతనే హైదరాబాద్ కు తిరిగి వెళ్తామన్నారు. ఇక్కడి పంపు హౌస్ లోని ఒక్క పంపును ఆన్ చేయడం ద్వారా స్టేషన్ ఘనపూర్,పాలకుర్తి, జనగామ, కొంత భాగం వర్ధన్నపేట నియోజకవర్గాలలోని పంటలకు సాగునీరు అందించవచ్చన్నారు. క్షేత్రస్థాయిలో ఏ ఇబ్బందులు ఉన్నాయో ప్రత్యక్షంగా సమీక్షించేందుకు వచ్చినట్లు చెప్పారు. పరోక్షంగా చలి వాగు నీరు వదిలేయడానికి, పరకాల భూపాల్ పల్లి కి వదిలేయడానికి దోహదపడుతుందన్నారు. ఈ పంపును ఆన్ చేయడంలో సమస్య ఎదురయిందన్నారు. ఈ పంపును ఆన్ చేయడం ద్వారా ఉమ్మడి వరంగల్ జిల్లాలో రైతులను ఆదుకోవడం కోసం చర్యలు తీసుకునేందుకే ఇక్కడికి వచ్చినట్లు పేర్కొన్నారు. ఈ పంప్ హౌస్ ద్వారా ప్రత్యక్షంగా స్టేషన్ఘన్పూర్, పాలకుర్తి జనగామ,పరోక్షంగా పరకాల భూపాల్ పల్లి, కొంత వర్ధన్నపేట నియోజకవర్గాలకు సాగునీరు అందించేందుకు ఇక్కడికి వచ్చామన్నారు. దేవాదుల ప్రాజెక్టు గత పదేళ్ళగా ఎందుకు పూర్తి కాలేదనే విషయం అందరికీ తెలుసునని అన్నారు. దేవాదుల ఫేజ్ 1,2,3ని పూర్తిగా సమీక్షించి హైదరాబాద్ నుండి వచ్చినట్లు పేర్కొన్నారు. అవసరమైన నిధులను కేటాయించి అన్ని ఫేజ్ లను పూర్తి చేయడానికి యాక్షన్ ప్లాన్ తో చర్చించబోతున్నట్లు తెలిపారు.రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, దేవాదులకు ప్రాజెక్టును దివంగత రాజశేఖరరెడ్డి 2004లో చుట్టారని అన్నారు.చుట్టారని. జల యజ్ఞంలో భాగంగా ఆనాటి ఉమ్మడి వరంగల్ జిల్లాలో గోదావరి నీటితో ఈ ప్రాంతాన్ని సశేషంలను చేసేందుకు వాదుల ఆనాటి ఇందిరమ్మ ప్రభుత్వం లక్ష్యమని పేర్కొన్నారు.దేవాదుల ఫేజ్ 1 లో లక్షా నాలుగు వేల ఎకరాలు, ఫేస్ టూ 1,50,000 ఎకరాలు,పేజ్ 3లో మూడు లక్షల 50 వేల ఎకరాలు లక్ష్యంగా శ్రీకారం చుట్టినట్లు పేర్కొన్నారు. దివంగత రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే ఫేజ్1 పూర్తయింది అన్నారు. కిరణ్ కుమార్ రెడ్డి, రోశయ్య ముఖ్యమంత్రులుగా ఉన్న అయంలో ఫేజ్ 2 పనులు ప్రారంభమయ్యాయి అని అన్నారు.విభజన తర్వాత దేవాదులు ప్రాజెక్టును పూర్తిగా నిర్లక్ష్యమైందన్నారు. ఏఐబీపీలో చేర్చిన ఘనత రాజశేఖర్ రెడ్డికి దక్కిందన్నారు. ఇందిరమ్మ ప్రభుత్వ హయంలోనే ఫేస్ త్రీ ని ప్రారంభించుకున్నామని అన్నారు. మళ్లీ ఇందిరమ్మ ప్రభుత్వం హయాంలోనే పేజ్ 3 పూర్తి చేయబోతున్నట్లు చెప్పారు. ఇందిరమ్మ ప్రభుత్వం చిత్తశుద్ధి, కార్యదీక్ష ఎలా ఉంటుందో స్పష్టంగా చూస్తున్నారని అన్నారు.గత ప్రభుత్వం కొత్త ప్రాజెక్టులపైనే పెట్టారని అన్నారు. ఉమ్మడి జిల్లా తో పాటు సూర్యాపేట, సిద్దిపేటలను ఆయకట్టు ద్వారా కొద్ది వాటి నిధులతో అద్భుతమైన ఈ కార్యక్రమం పూర్తి చేయవచ్చనే ఆలోచన లేని కారణంగా దేవాదుల ప్రాజెక్ట్ ఆలస్యమైందన్నారు. గత ప్రభుత్వ హయాంలో దేవాదుల ప్రాజెక్ట్ నిర్లక్ష్యానికి గురైందన్నారు. ప్రతి రెండు నెలలకు ఒకసారి సాగునీటి పారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి సమీక్షిస్తున్నారని చెప్పారు.అనుకున్న ఆయకట్టు కంటే రైతులు ఎక్కువగా సాగు చేయడం వలన రెండో పంట సాగుకు రైతులకు నీటి ఇబ్బందుల్లో కలుగుతున్నాయని అన్నారు.ఎట్టి పరిస్థితులోనూ దేవాదుల ఫేజ్ 3 పంప్ హౌస్ ద్వారా నీరును అందించినట్లయితే 70వేల ఆయకట్టు పంటలను సురక్షితం చేయవచ్చని యుద్ధ ప్రాతిపదికన పంప్ హౌస్ మోటార్లను ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. రైతులకు ఇబ్బంది కలగకుండా నీళ్లు అందించాలనే ఉద్దేశంతోనే బడ్జెట్ సమావేశాలు ఉన్నా ఇక్కడికి వచ్చినట్లు తెలిపారు.ముందు రైతు శ్రేయసు ముఖ్యమైన ఉద్దేశంతో దేవదూల మూడు ఫేస్ భారత్ మోటర్లను

ఆనాటి ప్రభుత్వం అనాలోచితం నిర్ణయాల వలన దేవాదుల ప్రాజెక్ట్ పై నిర్లక్ష్యం జరిగిందన్నారు.గత ప్రభుత్వ నిర్లక్ష్య ఫలితంగానే తాగునీరు సాగునీటి ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు.రాష్ట్రంలో పంటలు ఎండిపోవడానికి తాగునీటి సమస్యలు తలెత్తడానికి గత ప్రభుత్వ నిర్వాహమేనని అన్నారు

స్టేషన్ఘన్పూర్ ఎమ్మెల్యే శ్రీహరి మాట్లాడుతూ దేవాదుల పంప్ హౌస్ మోటార్ల ప్రారంభోత్సవానికి విచ్చేసిన మంత్రులు ఉత్తంకుమార్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డిలకు ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు, రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలియజేశారు.చివరి ఆయకట్టు వరకు వరకు పంటలను కాపాడాలని ఆలోచనతో దేవాదుల పంప్ హౌస్ మోటార్ల ప్రారంభోత్సవం చేశారని,ప్రత్యేక చొరవ తీసుకున్న మంత్రులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఈ సమావేశంలో వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర సీడ్స్ గ్రోవర్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, కుడా చైర్మన్ ఇనగల వెంకట్రాంరెడ్డి సాగునీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి ప్రశాంత్ జీవన్ పాటిల్, హనుమకొండ జిల్లా కలెక్టర్ ప్రావీణ్య,జి.డబుల్ ఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, దేవాదుల,సాగునీటి పారుదల,ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పృథ్వీ షాకు చాలా కష్టకాలం నడుస్తోంది

**● షా చాలా అండర్ రేటెడ్ క్రికెటర్: శశాంక్ సింగ్ కీలక వ్యాఖ్యలు**

భారత క్రికెట్ లో పృథ్వీ షాది ప్రత్యేకమైన ప్రస్థానం అనడంలో సందేహం లేదు. మరో సచిన్ టెండూల్కర్ అనుకున్న వ్యక్తి ఇప్పుడు అనామకంగా మిగిలాడు. ఎంతవేగంగా అంతర్జాతీయ యవనికలో అడుగు పెట్టాడో అంతే వేగంగా తెరమరుగైయ్యాడు. భారత్ తరపున ఐదు టెస్టులు, ఆరు వన్డేలు, ఒక టీ20 ఆడిన షా.. ఆ తర్వాత జాతీయ జట్టు కాదు కదా.. కనీసం డొమెస్టిక్ లెవల్లో కూడా సత్తా చాట లేక పోయాడు. తాజాగా అతని గురించి షా మిత్రుడు, ఐపీఎల్ సంచలనం శశాంక్ సింగ్ వ్యాఖ్యానించాడు. తనకు 13 ఏళ్ల వయుసున్నపటి నుంచి షా తనకు తెలుసని, కొన్ని కారణాల వల్ల అతని డౌన్ ఫాల్ స్టార్ట్ అయిందని వ్యాఖ్యానించాడు. నిజానికి షాకు ఇప్పుడు చాలా కష్టకాలం నడుస్తోంది. ఐపీఎల్ 2025లో అన్ సోల్డ్ గా మిగిలిన షా.. విజయ్ హజారేట్రోఫీ, రంజీ ట్రోఫీలలో ముంబై జట్టు నుంచి కూడా ఉద్వాసనకు గురయ్యాడు. తాజాగా రూట్ మొబైల్ కప్పులో తను బరిలోకి దిగాడు. షా చాలా అండర్ రేటెడ్ క్రికెటర్ అని, తను సత్తా చాటడం భారత క్రికెట్ కు ముఖ్యమని శశాంక్ అభివర్ణించాడు. యశస్వి జైస్వాల్, శుభమాన్ గిల్ స్థాయిలో తను ఓపెనర్ గా ఎదిగేవాడని, అయితే కొన్ని కారణాల వల్ల తన డౌన్ ఫాల్ ప్రారంభమైందని పేర్కొన్నాడు. ఇప్పటికైనా కొన్ని మార్పులు చేస్తే, తను తిరిగి గాడిలో పడతాడని పేర్కొన్నాడు. పది గంటలకే పడుకోవడం, స్ట్రిక్టు డైట్ పాటించడం, మరికొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా తను బౌన్స్ బ్యాక్ కాగలడని ఆశాభావం వ్యక్తం చేశాడు. ఈ మార్పులతో తనకు ఎదురే ఉండబోదని వ్యాఖ్యానించాడు. నిజానికి గత సీజన్ శశాంక్ సింగ్ కెరీర్ కు టర్నింగ్ పాయింట్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. వేలంలో అనూహ్యంగా శశాంక్ ను కొనుగోలు చేసిన పంజాబ్ కింగ్స్ కు లక్కు కలిసొచ్చింది. ఈ సీజన్లో 165 స్ట్రైక్ రేట్ తో 354 పరుగులు సాధంచాడు. ఎన్నో మ్యాచ్ ల్లో కీలక ఇన్నింగ్స్ తో ఆకట్టుకున్నాడు. పంజాబ్ తో పాటు మిగతా క్రికెట్ ప్రేమికుల మనసు దోచాడు. దీంతో అతనిపై ఫ్రాంచైజీ ఎనలేని విశ్వాసాన్ని వ్యక్తం చేసింది. పంజాబ్ తరపు మొట్టమొదటి రిటెన్షన్ గా శశాంక్ నే ఎంచుకోవడం విశేషం. 5.5 కోట్ల రూపాయలతో తనను రిటైన్ చేసుకుంది. తను అన్ క్యాప్డ్ ప్లేయర్ కాబట్టి, ఆ ధర పలికింది. భారత జట్టుకు ప్రాతినిథ్యం వహించి క్యాప్డ్ ప్లేయర్ కేటగిరీలో ఉన్నట్లయితే తనకు భారీ ధర పలికేదని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక గతేడాది గూగుల్లో అత్యధిక మంది సెర్చ్ చేసిన అథ్లెట్లలో శశాంక్ పేరు ప్రముఖంగా నిలిచింది. ఒక్క హార్దిక్ మాత్రమే ఈ జాబితాలో టాప్-10లో నిలిచాడు. ఈ ఏడాది పంజాబ్ కింగ్స్ తరపున బరిలోకి దిగనున్న శశాంక్.. నూతన సారథి శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో ఆడనున్నాడు.







# రేపు ఐపీఎల్ జట్ల కెప్టెన్లతో బోర్డు సమావేశం

ఐపీఎల్ వారంలోకి వచ్చేశాం. ఈనెల 22 నుంచి మెగాటోర్నీ ప్రారంభం కాబోతోంది. కోల్ కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా కోల్ కతా నైట్ రైడర్స్, రాయల్ చాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య మ్యాచ్ తో ఐపీఎల్ 2025 అధికారికంగా ప్రారంభం కాబోతోంది. అయితే అంతకన్నా ముందే ఈనెల 20న అన్ని జట్ల కెప్టెన్లతో సమావేశాన్ని బీసీసీఐ ఏర్పాటు చేయనుంది. ఈ సమావేశం బోర్డు హెడ్ క్వార్టర్ అయిన ముంబైలో జరుగుతుంది. క్రికెట్ సెంటర్లో నాలుగు గంటలపాటు ఈ కార్యక్రమం జరుగుతుంది. తొలి గంటలో ఈ సీజన్ లోని మార్పులు గురించి, ఆ తర్వాత స్పాన్సర్లకు సంబంధించిన కార్యక్రమాలు, ఆ తర్వాత కెప్టెన్లతో ఫొటో షూట్ నిర్వహించనున్నారు. ఇక ఈ టోర్నీలో ఇప్పటికే అన్ని జట్ల కెప్టెన్ల ప్రకటన కూడా పూర్తయ్యింది. చెన్న సూపర్ కింగ్స్ ( కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్), రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (రజత్ పాటీదార్), సన్ రైజర్స్ హైదరాబాద్ (పాట్ కమిన్స్), ముంబై ఇండియన్స్ (హార్దిక్ పాండ్యా), గుజరాత్ టైటాన్స్ (శుభమాన్ గిల్), కోల్ కతా నైట్ రైడర్స్ (అజింక్య రహానే), లక్నో సూపర్ జెయింట్స్ (రిషభ్ పంత్), ఢిల్లీ క్యాపిటల్స్ (అక్షర్ పటేల్), రాజస్థాన్ రాయల్స్ (సంజూ శాంసన్), పంజాబ్ కింగ్స్ (కెప్టెన్ శ్రేయస్ అయ్యర్) ఐపీఎల్ 2025లో పాల్గొంటున్నాయి. ఐపీఎల్ షెడ్యూల్ గతంలోనే ప్రకటించారు. ఈసారి 74 మ్యాచ్ లను ఆడనున్నారు. అందులో 12 డబుల్ హెడర్లు అంటే ఒకేరోజు రెండు మ్యాచ్ లు ఉండనున్నాయి. తొలి డబుల్ హెడర్ ఆదివారం జరుగుతుంది. తొలి మ్యాచ్ లో సన్ రైజర్స్, రాజస్థాన్ మధ్య మ.3.30 గం.లకు మ్యాచ్ జరుగుతుంది. ఆ తర్వాత సా.7.30 గం.లకు చెన్నైతో ముంబై తలపడనుంది. ఆ తర్వాత వైజాగ్ లో ఢిల్లీ క్యాపిటల్స్ తో లక్నో సూపర్ జెయింట్స్ , మార్చి 25న అహ్మదాబాద్ లో గుజరాత్ తో పంజాబ్ ఆడనుంది. లీగ్ దశ ముగిశాక, ఫైనల్ కి వెళ్లే జట్లను నిర్ణయించే క్వాలిఫయర్-1, ఎలిమినేటర్ మ్యాచ్ లను ఈసారి హైదరాబాద్ లోని ఉప్పల్ రాజీవ్ గాంధీ మైదానంలో నిర్వహిస్తున్నారు. మే20న క్వాలిఫయర్-1, తర్వాతిరోజు ఎలిమినేటర్ మ్యాచ్ లను నిర్వహిస్తారు. 23న కోల్ కతాలో క్వాలిఫయర్ -2ను నిర్వహిస్తారు. మే25న కోల్ కతాలోని ఈడెన్ గార్డెన్స్ లో ఫైనల్ మ్యాచ్ నిర్వహించున్నారు. చెన్నై, ముంబై చెరో ఐదు ట్రోఫీలతో లీగ్ లో అత్యంత విజయవంతమైన జట్లుగా నిలిచాయి. గతేడాది కప్పును కోల్ కతా నైట్ రైడర్స్ గెలుపొందింది. ఫైనల్లో సన్ రైజర్స్ ను ఓడించి మూడోసారి టైటిల్ ను కైవసం చేసుకుంది. ఇక 2016లో చివరిసారి కప్పు గెలిచిన సన్ రైజర్స్ హైదరాబాద్.. 2018, 2024లో రెండుసార్లు తుదిమెట్టుపై బోల్తా పడింది. దీంతో ఈసారి ఎలాగైనా కప్పు సాధించాలని పట్టుదలగా ఉంది. ఈసారి బ్యాటింగ్ ను మరింత బలంగా మార్చడంతోపాటు, బౌలింగ్ నూ పటిష్ట పరిచింది.

# రజత్ పటీదార్ ప్రతిభావంతమైన కుర్రాడు

**● ఆర్‌సీబీ భవిష్యత్తు అతనే..పటీదార్‌పై కోహ్లీ ప్రశంసల జల్లు**




రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) నయా సారథి రజత్ పటీదార్‌పై ఆ జట్టు మాజీ కెప్టెన్, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ప్రశంసల జల్లు కురిపించాడు. రజత్ పటీదార్ ప్రతిభావంతమైన కుర్రాడని కొనియాడాడు. ఆర్‌సీబీ భవిష్యత్తు అతనేనని తెలిపాడు. ఐపీఎల్ 2025 సీజన్ ముంగిట ఆర్‌సీబీ.. తమ నూతన సారథిగా యువ ప్లేయర్ అయిన రజత్ పటీదార్‌ను నియమించిన విషయం తెలిసిందే.అప్‌కమింగ్ సీజన్ నేపథ్యంలో ఆర్‌సీబీ సోమవారం.. చిన్నస్వామి స్టేడియంలో అన్‌బాక్స్ ఈవెంట్ నిర్వహించింది. అప్‌కమింగ్ సీజన్‌తో పాటు టీమ్ కాంబినేషన్ గురించి కోహ్లీ ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. ఈ క్రమంలోనే రజత్ పటీదార్‌ను కొనియాడుతూ.. అతనికి మద్దతుగా నిలవాలని ఫ్యాన్స్‌ను కోరాడు. 'రజత్ పాటిదార్ ఓ అద్భుతమైన ఆటగాడు. అతనిపై కీలకమైన బాధ్యతలు ఉన్నాయి. ఆర్‌సీబీని విజయవంతంగా నడిపించడమే కాకుండా అభిమానుల నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత ఉంది. ఈ ఫ్రాంచైజీ అతనిపై పెట్టుకున్న ఆశల్ని అతను తప్పక నెరవేరుస్తాడనే నమ్మకం ఉంది. తప్పకుండా ఆర్‌సీబీని గెలుపు బాటలో నడిపిస్తాడు. సారథిగా ఎదగడానికి కావాల్సిన అన్ని అర్హతలు, ప్రతిభ అతనిలో ఉన్నాయి.'అని విరాట్ కోహ్లీ తెలిపాడు.ఐపీఎల్ 2021లో ఆర్‌సీబీ తరఫున అరంగేట్రం చేసిన రజత్ పటీదార్.. 4 మ్యాచ్‌లు ఆడి 71 పరుగులతో తీవ్రంగా నిరాశపరిచాడు. ఈ పేలవ ప్రదర్శనతో ఆర్‌సీబీ తర్వాతి సీజన్‌కే అతన్ని వేలంలోకి వదిలేసింది. ఐపీఎల్ 2022 వేలంలో అతన్ని ఏ జట్టు కూడా కొనుగోలు చేయలేదు. దాంతో అన్‌సోల్డ్‌గా నిలిచాడు. అయితే ఐపీఎల్ 2022 సీజన్ ముంగిట ఆర్‌సీబీ తీసుకున్న అనామక ప్లేయర్ లవ్‌నీత్ సిసోడియా గాయపడటంతో అతని స్థానంలో అనూహ్యంగా రజత్ పటీదార్ జట్టులోకి వచ్చాడు. ప్రాక్టీస్ మ్యాచ్‌ల్లో మెరుగైన ప్రదర్శన చేయడంతో అతనికి ఆర్‌సీబీ మేనేజ్‌మెంట్ తుది జట్టులో చోటిచ్చింది. రూ. 20 లక్షల కనీస ధరతోనే జట్టులోకి వచ్చిన అతను ఆ సీజన్‌లో 8 మ్యాచ్‌ల్లో 55.50 సగటుతో 333 పరుగులు చేశాడు. ఇందులో రెండు హాఫ్ సెంచరీలతో పాటు ఓ శతకం సాధించాడు. అది కూడా లక్నో సూపర్ జెయింట్స్‌తో ఎలిమినేటర్ మ్యాచ్‌లో 54 బంతుల్లో 112 పరుగులతో అజేయంగా నిలిచి అందరి దృష్టిని ఆకర్షించాడు. ఐపీఎల్ ప్లేఆఫ్స్‌లో సెంచరీ చేసిన తొలి అనామక ప్లేయర్‌గా చరిత్ర సృష్టించాడు. ఈ సెంచరీ ఇన్నింగ్స్ పటీదార్ తలరాతను మార్చేసింది. కానీ గాయం కారణంగా తర్వాతి ఐపీఎల్ 2023 సీజన్ మొత్తానికి దూరమయ్యాడు. అతనిపై నమ్మకం ఉంచిన ఆర్‌సీబీ అండగా నిలిచింది. ఐపీఎల్ 2024 సీజన్‌లో రీఎంట్రీ ఇచ్చిన అతను 15 మ్యాచ్‌ల్లో 5 హాఫ్ సెంచరీలతో 395 పరుగులు చేశాడు. ఈ ప్రదర్శనతో ఆర్‌సీబీ అతన్ని రూ. 11 కోట్ల భారీ ధరకు రిటైన్ చేసుకుంది. గత సీజన్ వరకు జట్టును నడిపించిన ఫాఫ్ డుప్లెసిస్‌ను వదిలేయడంతో తమ సారథిగా రజత్ పటీదార్‌ను నియమించింది. గాయపడిన ఆటగాడికి రిప్లేస్‌మెంట్‌గా రూ. 20 లక్షల కనీస ధరతో జట్టులోకి వచ్చిన రజత్ పటీదార్.. మెరుగైన ప్రదర్శనతో రూ. 11 కోట్ల ధరను అందుకోవడంతో పాటు ఇప్పుడు ఏకంగా ఆర్‌సీబీ సింహాసనంపైనే కూర్చున్నాడు.

# మళ్లీ 75,000 పైకి సెన్సెక్స్



ముంబై: భారత స్టాక్ మార్కెట్ ప్రామాణిక సూచీలు మంగళవారం భారీ లాభాలను నమోదు చేశాయి. సెన్సెక్స్ ఏకంగా 1,131.31 పాయింట్ల (1.53 శాతం) వృద్ధితో 75,301.26 వద్దకు చేరుకుంది. నిఫ్టీ 325.55 పాయింట్లు (1.45 శాతం) బలపడి 22,834.30 వద్ద స్థిరపడింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి తెరపడనుందన్న అంచనాలు, ఫెడ్ రేట్ల తగ్గింపు ఆశలు, అమెరికా, చైనాలో రిటైల్ విక్రయాల తాజా గణాంకాలు అత్యంత సానుకూలంగా ఉండటంతో అంతర్జాతీయ మార్కెట్లలో ట్రేడింగ్ ట్రెండ్ బుల్లిషగా మారింది. దాంతో దేశీయ మదుపరులూ జోరుగా కొనుగోళ్లకు పాల్పడటం సూచీల ర్యాలీకి ప్రధానంగా దోహదపడింది. ముడి చమురు సెగలు కాస్త తగ్గడంతో పాటు డాలర్ సూచీ బలహీనపడటం కూడా మార్కెట్లకు కలిసివచ్చింది. క్రితం సెషన్‌లోనూ సూచీలు మోస్తరుగా లాభపడ్డాయి. గడిచిన రెండు రోజుల్లో ఈక్విటీ మదుపరుల సంపదగా పరిగణించే బీఎసఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.8.67 లక్షల కోట్లకు పైగా పెరిగి రూ.399.85 లక్షల కోట్లకు (4.61 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. మంగళవారం ఒక్కరోజే మార్కెట్ సంపద రూ.7 లక్షల కోట్ల మేర పుంజుకుంది. సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 26 రాణించాయి.

# ఈ నెలాఖరు నాటికి

**ఆరోగ్య బీమాలోకి ఎల్ఐసీ**

ముంబై: వచ్చే రెండు వారాల్లో ఓ ఆరోగ్య బీమా సంస్థలో వాటా కొనుగోలు చేయనున్నట్లు ప్రభుత్వ రంగ జీవిత బీమా దిగ్గజం లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎల్ఐసీ) ఎండీ, సీఈఓ సిద్ధార్థ మొహంతి తెలిపారు. అయితే, ఏ కంపెనీలో వాటా కొనుగోలు చేయబోతున్న విషయాన్ని మాత్రం ఆయన వెల్లడించలేదు. వాటా కొనుగోలుకు సంబంధించి చర్చలు తుది దశలో ఉన్నాయని, ఈ నెలాఖరు నాటికి ఒప్పందం కుదరవచ్చని మొహంతి ధీమా వ్యక్తం చేశారు. అయితే, ఆరోగ్య బీమా కంపెనీలో ఎల్ఐసీ మెజారిటీ వాటా (51 శాతం, అంతకుపైగా) మాత్రం కొనుగోలు చేయబోదని స్పష్టం చేశారు. మంగళవారం 'జీసీఏ25' కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన ఈ విషయాల్ని వెల్లడించారు.

ఎంత వాటా కొనుగోలు చేయాలనేది ఎల్ఐసీ బోర్డు నిర్ణయంతో పాటు లక్షిత ఆరోగ్య బీమా సంస్థ మార్కెట్ విలువపై ఆధారపడి ఉంటుందన్నారు. ప్రస్తుతం జీవిత కంపెనీలు ఆరోగ్య బీమా కవరేజీ ఆఫర్ చేసేందుకు అనుమతి లేదు. అయితే, బీమా కంపెనీలు జీవిత, ఆరోగ్య, సాధారణ బీమా సేవలందించేందుకు వీలుగా కాంపొజిట్ లైసెన్సులను ప్రవేశపెట్టాలని ఇండస్ట్రీ వర్గాలు కేంద్ర ప్రభుత్వానికి సిఫారసు చేశాయి. ఇందుకు సంబంధించి ఈసారి బడ్జెట్లో ప్రకటన వెలువడవచ్చని మార్కెట్ వర్గాలు భావించినప్పటికీ, అది జరగలేదు.





# అమరావతి, తిరుపతి, విశాఖలో లులు మాల్స్

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి, ఆధ్యాత్మిక నగరం తిరుపతి, సాగర నగరం విశాఖపట్నంలలో మాల్స్ ఏర్పాటు చేసేందుకు లులు సంస్థ సంసిద్ధత వ్యక్తం చేసింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఈ విషయాన్ని మంత్రివర్గ సమావేశంలో వెల్లడించారు. నిజానికి 2014-19 మధ్య అప్పటి చంద్రబాబు ప్రభుత్వం విశాఖపట్నం సాగర తీరంలో లులు మాల్‌కు స్థలం కేటాయించింది. అయితే, ఆ తర్వాత ప్రభుత్వం మారడంతో అది కాస్త హైదరాబాద్‌కు తరలిపోయింది. ఇప్పుడు మళ్లీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాష్ట్రానికి వచ్చేందుకు ఆ సంస్థ అంగీకారం తెలిపింది. వైజాగ్‌లో మాల్ ఏర్పాటు ప్రతిపాదనకు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు సమ్మతి తెలియజేసింది. దానికి కేబినెట్ ఇప్పుడు ఆమోదం తెలిపింది.

కాగా, రాజధాని అమరావతి నిర్మాణ పనుల్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేతుల మీదుగా పునఃప్రారంభించబోతున్నట్టు ఇటీవల ప్రభుత్వం తెలిపింది. ఇదే విషయాన్ని మంత్రివర్గానికి తెలియజేశారు. ప్రధాని మోదీని ఆహ్వానించేందుకు చంద్రబాబు నేటి సాయంత్రం ఢిల్లీ వెళ్లనున్నారు. ఈ సందర్భంగా ప్రధానితోపాటు కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్‌ను కూడా చంద్రబాబు కలుస్తారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో వివిధ పథకాలు, కార్యక్రమాల కింద రాష్ట్రానికి పెండింగ్‌లో ఉన్న నిధుల జాబితాను తీసుకెళ్లనున్నారు. వాటికి నిధులు విడుదల చేయాల్సిందిగా నిర్మలను కోరనున్నారు.





## అత్యధికంగా పన్ను చెల్లించిన బిగ్‌బీ

బాలీవుడ్ స్టార్ అమితాబ్ బచ్చన్ కొత్త రికార్డు క్రియేట్ చేశాడు. అత్యధిక పన్ను చెల్లిస్తున్న సెలబ్రిటీగా చరిత్రకెక్కాడు. 2024-2025 సంవత్సరానికి బిగ్ బీ అమితాబ్.. సుమారు 120 కోట్ల ఆదాయ పన్ను చెల్లించారు. పన్ను చెల్లింపుల్లో ఆయన షారూక్ ఖాన్, విజయ్‌లను దాటేశారు. గత ఏడాది షారూక్ ఖాన్ 92 కోట్ల ట్యాక్స్ చెల్లించారు. అయితే ఇప్పుడు ఆ రికార్డును బాలీవుడ్ నటుడు అమితాబ్ చెరిపేశారు. 82 ఏళ్ల ఆ స్టార్ నటుడు 2024-25 సంవత్సరానికి 120 కోట్ల పన్ను కట్టారు. కల్కి 2898 ఏడీ, వెట్టియాన్ చిత్రాల్లో అమితాబ్ నటనపై ప్రశంసలు కురిశాయి. బ్రాండ్ ఎండోర్స్‌మెంట్లతోనూ బిగ్ బీ ఆర్జన రెట్టింపు అయ్యింది. కౌన్ బనేగా కరోడ్‌పతి సీజన్ 16 ద్వారా కూడా ఆయన ఆదాయం పెరిగింది. రియల్ ఎస్టేట్ వ్యాపారం ద్వార కూడా అమితాబ్ తన ఆదాయాన్ని పెంచుకున్నది. చిత్రాలు, టాప్ బ్రాండ్లకు ప్రమోటర్‌గా అమితాబ్ అత్యధిక స్థాయిలో ఆర్జిస్తున్నారు. అయితే 2024-25 సంవత్సరానికి ఆయన సుమారు 350 కోట్లు ఆర్జించినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఫిల్మ్ ఇండస్ట్రీకి చెందిన వ్యక్తుల్లో అత్యధికంగా ఆర్జిస్తున్న ఆర్టిస్టుగా అమితాబ్ నిలిచారు. పన్ను చెల్లింపుల్లో దేశ ప్రజలకు అమితాబ్ రోల్‌మోడల్‌గా ఉంటాడని ఓ వ్యక్తి తెలిపారు. సెక్షన్ 84, కల్కి 2898 ఏడీ సీక్వెల్‌లో కూడా అమితాబ్ నటిస్తున్నాడు.

# వరుస సినిమాలతో స్పీడ్‌పెంచిన రితికాసింగ్

చిన్నప్పటి నుంచి కిక్ బాక్సింగ్ లో శిక్షణ తీసుకున్న రితికా సింగ్ బాక్సింగ్ నేపథ్య కథతో తీసిన 'సాలా ఖదూస్' మూవీతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇదే సినిమా తమిళంలో ఇరుడి సుట్రు పేరుతో రీమేక్ అయ్యింది. ఇది కూడా మంచి విజయం సాధించింది. విక్టరీ వెంకటేశ్ నటించిన గురు సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైంది హీరోయిన్ రితికా సింగ్. ఈ మూవీ తర్వాత అంతగా ఆఫర్స్ రాలేదు.. తెలుగులో పెద్దగా కనిపించక పోయినా తమిళ్ లో సినిమాలు చేస్తుంది. చిన్నప్పటి నుంచి కిక్ బాక్సింగ్ లో శిక్షణ తీసుకున్న రితికా సింగ్ బాక్సింగ్ నేపథ్య కథతో తీసిన 'సాలా ఖదూస్' మూవీతో హీరోయిన్ గా ఎంట్రీ ఇచ్చింది. ఈ మూవీ బ్లాక్ బస్టర్ గా నిలిచింది. ఇదే సినిమా తమిళంలో ఇరుడి సుట్రు పేరుతో రీమేక్ అయ్యింది. ఇది కూడా మంచి విజయం సాధించింది. ఇప్పుడు తెలుగుతోపాటు తమిళం, మలయాళం చిత్రాల్లో నటిస్తూ తనకంటూ ఓ గుర్తింపు సంపాదించుకుంటుంది. గురు సినిమా తర్వాత తర్వాత విజయ్ సేతుపతితో కలిసి ఆండవన్ కట్టలై, అలాగే రాఘవ లారెన్స్ సరసన శివలింగ సినిమాల్లో నటించింది రితిక. ఈ రెండు చిత్రాలు కూడా హిట్ గా నిలిచాయి. గురు తర్వాత నేరుగా మరే తెలుగు సినిమాలోనూ నటించలేదు రితిక. కేవలం నీవెవ్వరో అనే సినిమాలో కనిపించింది. ఇక ఈ ముద్దుగుమ్మ చివరిగా రజనీకాంత్ వెట్టయాన్ సినిమాలో నటించింది. వెట్టయాన్ చిత్రంలో కీలకపాత్ర పోషించింది. ఇందులో పవర్ ఫుల్ పోలీసాఫీసర్ గా ఆకట్టుకుందీ అందాల తార. సినిమాల సంగతి పక్కన పెడితే.. రితిక సోషల్ మీడియలో ఫుల్ యాక్టివ్ గా ఉంటుంది. ఈ ముద్దుగుమ్మ చేసే వర్కౌట్లకు అభిమానులు, నెటిజన్లు ఆశ్చర్యపోతుంటారు. అలాగే కొన్ని క్రేజీ ఫోటోలను కూడా సోషల్ మీడియాలో పంచుకుంటూ ఉంటుంది ఈ వయ్యారి భామ. తాజాగా రితిక షేర్ చేసిన ఫోటోలు నెట్టింట వైరల్ గా మారాయి.





## పల్లెటూరి వాతావరణంలో చిరంజీవి కొత్త చిత్రం

మెగాస్టార్ చిరంజీవితో దర్శకుడు అనిల్ రావిపూడి కొత్త ప్రాజెక్టుకు సంబంధించిన చిత్ర నిర్మాణం జూన్ మొదటి వారంలో ప్రారంభించనున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్టు ప్రత్యేకత ఏమిటంటే .. చాలా ఏళ్ల తర్వాత పల్లెటూరి అందాల నడుమ ఈ చిత్ర నిర్మాణం చేయనున్నారు. ఈ సినిమాను సంక్రాంతి సీజన్‌కు విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రంలో వినోదానికి ఏ మాత్రం కొదవ ఉండబోదని ఇప్పటికే నిర్మాణ సంస్థ వెల్లడించింది. ఈ చిత్రంలో హీరోయిన్‌గా అదితి రావు హైదరీ నటించనున్నారని వార్తలు వినబడుతున్నాయి. అయితే దీనికి సంబంధించి అధికారిక ప్రకటన త్వరలో రానుంది. 'సంక్రాంతికి వస్తున్నాం' తో బ్లాక్ బస్టర్ హిట్ కొట్టిన కాంబో అయిన సంగీత దర్శకులు భీమ్స్, రమణ గోగుల ఈ మూవీకి పని చేయనున్నారని అంటున్నారు. ఇటీవలే నిర్మాణ సంస్థ సింహాద్రి అప్పన్నను దర్శించుకుని ఈ చిత్రానికి సంబంధించి స్క్రిప్ట్ కు పూజలు చేయించారు. ఇప్పటి వరకూ రంగు రంగుల సెట్టింగ్‌లు, హైటెక్ హంగులతో చిత్ర నిర్మాణాలు స్టూడియోలలోనే చేయగా, ఇప్పుడు గతంలో మాదిరి పల్లెటూరి అందాల నడుమ చిత్ర నిర్మాణం చేయనున్నారు. మెగాస్టార్ చిరంజీవి గతంలో విలేజ్ బ్యాక్ డ్రాప్‌లో ఊరికి ఇచ్చిన మాట, పల్లెటూరి మోసగాడు, శివుడు శివుడు శివుడు, ఖైదీ, అల్లుడా మజాకా, ఆపద్బాంధవుడు, ఇంద్ర, సింహపురి సింహం వంటి మూవీలు చేశారు. ఈ సినిమాలు చిరు అభిమానులను విశేషంగా అలరించాయి. ఈ మూవీలు కేవలం వినోదమే కాకుండా పల్లెటూరి సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానాన్ని చక్కగా ఆవిష్కరించి ఆకట్టుకున్నాయి.

## విష్ణుప్రియ, టేస్టీతేజకు నోటీసులు



బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో పంజాగుట్ట పోలీసులు విచారణను వేగవంతం చేశారు. యువత జీవితాలతో చెలగాటం ఆడుతున్న బెట్టింగ్ యాప్స్‌ని ప్రమోటు చేస్తున్న టీవీ నటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లూయెన్సర్లు సహా మంది పోలీసులు సోమవారం కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసులో పోలీసులు యాంకర్, బిగ్‌బాస్ ఫేమ్ విష్ణుప్రియ, యూట్యూబర్, కమెడియన్ టేస్టీ తేజకు పోలీసులు నోటీసులు జారీ చేశారు. మంగళవారం సాయంత్రం 4 గంటలకు విచారణకు రావాలని నోటీసుల్లో ఆదేశించారు. విచారణ తర్వాత మరికొందరికి సైతం విచారణకు రావాలని నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తున్నది. ఇప్పటికే బెట్టింగ్ యాప్స్‌ని ప్రమోట్ చేసిన ఇతర వ్యక్తులపై సైతం పోలీసులు ప్రత్యేకంగా దృష్టి సారించారు. బెట్టింగ్ యాప్స్‌ను ప్రమోట్ చేసిన ఇన్‌ఫ్లుయెన్సర్లు, యూట్యూబర్స్, టీవీ నటుల్లో పలువురిపై కేసులు నమోదైన విషయం తెలిసిందే. యాంకర్లు విష్ణుప్రియ, శ్యామల, హర్షసాయి, ఇమ్రాన్ ఖాన్, టేస్టీ తేజ, కిరణ్ గౌడ్, రీతూ చౌదరి, సుప్రీత, సుధీర్, అజయ్, సన్నీ యాదవ్ పలువురిపై పలు సెక్షన్లతో పాటు యాక్టుల కింద కేసులు నమోదు చేశారు. ఇప్పటికే సేకరించిన యాప్స్ లింక్స్ ఆధారంగా పోలీసులు నోటీసులు జారీ చేస్తున్నట్లు సమాచారం.

## షారుఖ్‌ఖాన్‌తో సుకుమార్ సినిమా?



పుష్ప ది రూల్ సినిమాతో నేషన్ వైడ్ బ్లాక్ బస్టర్ అందుకున్నాడు దర్శకుడు సుకుమార్. అయితే ఈ ప్రాజెక్ట్ అనంతరం సుకుమార్ ఎవరితో సినిమా చేయబోతున్నాడా అని మూవీ లవర్స్ ఆసక్తికరంగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. టాలీవుడ్ సినీ వర్గాల ప్రకారం సుకుమార్ తన నెక్స్ట్ ప్రాజెక్ట్ రామ్ చరణ్‌తో '17' చేస్తాడని అంటుండగా.. మరోవైపు 'పుష్ప 3' కథ రాసే పనిలో ఉన్నడని టాక్ వినిపిస్తుంది. ఇదిలావుంటే.. ఈ రెండు కాకుండా మరో క్రేజీ పాన్ ఇండియా కాంబో తెరమీదకు వచ్చింది. బాలీవుడ్ సూపర్‌స్టార్ షారుఖ్ ఖాన్, దర్శకుడు సుకుమార్ కలిసి ఒక ప్రాజెక్ట్ చేయబోతున్నారని ప్రస్తుతం వార్తలు వైరల్ అవుతున్నాయి. వీరిద్దరు కలిసి ఒక పాన్ ఇండియా ప్రాజెక్ట్ కోసం చేతులు కలపబోతున్నట్లు సోషల్ మీడియాలో టాక్ వినిపిస్తుంది. ఒకవేళ ఇదే నిజమైతే సుకుమార్ పేరు బాలీవుడ్‌లో మారుమోగడం ఖాయం. రూరల్ విలేజ్ బ్యాక్‌డ్రాప్ కథతో ఈ సినిమా రాబోతుండగా.. భారీ బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కించబోతున్నట్లు తెలుస్తుంది. మరోవైపు ఈ సినిమాలో షారుఖ్ ఖాన్‌ను విలన్ పాత్రలో చూపించే ఆలోచనలో సుకుమార్ ఉన్నట్లు సమాచారం. కాగా ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

## ఎంఎస్ ధోనితో యాడ్‌ను తీసిన సందీప్‌రెడ్డి.




ఇండియన్ స్టార్ క్రికెటర్ ఎంఎస్ ధోని యానిమల్ సినిమాలో నటించాడు. ధోని ఏంటి యానిమల్ సినిమా ఏంటి అనుకుంటున్నారా విషయం ఉందండి. ప్రముఖ ఎలక్ట్రిక్ సైకిల్ బ్రాండ్ ఈమోటోరాడ్. తన కంపెనీ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎంఎస్ ధోనిని నియమించుకున్న విషయం తెలిసిందే. ఎలక్ట్రిక్ సైకిల్ బ్రాండ్ ప్రమోషన్స్‌లో భాగంగా తాజాగా ధోనీతో కలిసి ఒక యాడ్‌ను విడుదల చేసింది ఈ కంపెనీ. ఇందులో యానిమల్ సినిమాలో ఎంఎస్ ధోని నటిస్తే ఎలా ఉంటుందో అచ్చుగుద్దినట్లు ఫన్నీగా దింపారు దర్శకుడు సందీప్ రెడ్డి. ఎంఎస్ ధోని యానిమల్ సినిమాలో రణ్‌విజయ్ సింగ్(యానిమల్ చిత్రంలో రణ్‌బీర్ కపూర్ పాత్ర పేరు)లా కనిపించడం.. ఇంటర్వెల్‌కి ముందు బ్లూ కోట్ లో బ్లాక్ కలర్ కార్ నుంచి దిగే సీన్, సినిమా ప్రారంభంలో హీరోయిన్ ఇంటికి హీరో వెళ్లే సీన్, క్లైమాక్స్ లో సైగ చేసి చూపించే సీన్. ఇలా రణ్‌బీర్ చేసే ప్రతి సీన్‌ని ధోనితో చేయించాడు సందీప్. ఫుల్ ఫన్ ఎంటర్‌టైనర్‌గా ఉన్న ఈ స్పూఫ్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

## అలాంటి పాత్ర ఇప్పుడొస్తే ఇంకా బాగా చేస్తా!



అర్జున్ రెడ్డి సినిమాతో హీరోయిన్ గా ఇండస్ట్రీలోకి ఎంట్రీ ఇచ్చింది షాలినీ పాండే. మొదటి సినిమాతోనే సూపర్ హిట్ ను అందుకున్న షాలినీ, ఆ తర్వాత పలు అవకాశాలను అందుకుని తమిళ, హిందీ భాషల్లో సినిమాలు చేసింది. తాజాగా షాలినీ ఓ ఇంటర్వ్యూలో పాల్గొని పలు ఆసక్తికర విషయాలను పంచుకుంది.అర్జున్ రెడ్డి సినిమాలో ప్రీతి పాత్ర తో ప్రతీ ఒక్కరినీ మెప్పించింది షాలినీ. అయితే అర్జున్ రెడ్డి రిలీజ్ టైమ్ లో ఆ సినిమాలోని హీరో హీరోయిన్ల పాత్రలను కొందరు కామెంట్ చేశారు. హీరోయిన్ క్యారెక్టర్ చాలా వీక్ గా ఉందని అన్నారు. తాజాగా షాలినీకి ఈ విషయమై ఓ ప్రశ్న ఎదురైంది. ప్రీతి తరహా పాత్ర ఇప్పుడొస్తే యాక్సెప్ట్ చేస్తారా అని అడిగారు.ఆ ప్రశ్నకు షాలినీ ఆసక్తికర సమాధానమిచ్చింది. ప్రీతి పాత్రను తను కెరీర్ స్టార్టింగ్ లో చేశానని, ఇప్పుడు దాని గురించి ఆలోచిస్తే ఎంతో ఇన్నోసెంట్ గా అనిపిస్తుందని, సినిమాలో తన క్యారెక్టర్ ను మరింత బలంగా చేయొచ్చుమో అనిపిస్తుందని ఇప్పుడు అలాంటి పాత్ర వస్తే నో చెప్పను కానీ ఆ పాత్రపై మరింత అవగాహన పెంచుకుని నటిస్తానంటోంది షాలినీ.అప్పుడు యాక్టింగ్ కొత్త కాబట్టి ప్రీతి పాత్రను గొప్పగా చేయలేకపోయానని, ప్రస్తుతం నటనలో పరిణీతి చెందాను కాబట్టి ఆ పాత్రను మరింత మెచ్యూర్డ్ గా చేయగలనని చెప్తోన్న షాలినీ, ఇప్పుడలాంటి క్యారెక్టర్ వస్తే డైరెక్టర్ తో మాట్లాడి కొన్ని మార్పులు చేయించుకుని ఆ పాత్రలో నటిస్తానంటోంది. డబ్బా కార్టెల్ సిరీస్‌లో ఎంతో బలమైన మహిళ పాత్రలో కనిపించిన షాలినీ అందులో రాజీ అనే పాత్రలో నటించింది. క్రైమ్ థ్రిల్లర్ గా రూపొందిన ఈ సిరీస్ లో జ్యోతిక, షబానా అజ్మీ కీలక పాత్రల్లో నటించగా, ఈ సిరీస్ నెట్‌ఫ్లిక్స్ లో స్ట్రీమింగ్ అవుతోంది.